విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 263 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 12 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## ఇండియాను అమ్మేశారు

## యూఎస్ డీల్ పై రాహుల్

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- ఆర్థిక మంత్రి నవ్వుతూ ఉంటారు.. మన డేటాతో ఏం చేశారని లోక్‌సభలో ప్రశ్న
- ఈ ఒప్పందంతో దేశ టెక్స్‌టైల్ పరిశ్రమ, రైతులు నాశనమవుతారని ఆరోపణ
- దేశ ప్రయోజనాలను అమెరికాకు అమ్మేశారంటూ సంచలన వ్యాఖ్యలు
- ఇంధన స్వాతంత్ర్యాన్ని కూడా అమెరికాకు తాకట్టు పెట్టారని ధ్వజం

న్యూ దిల్లీ: భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలో మన డేటాయే కీలకమని లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఇరుదేశాల మధ్య కుదిరిన ఒప్పందంలో భారతీయుల్ని బానిసలుగా చూడొద్దని, మేమూ మీతో సమానమే అని రాహుల్ తేల్చిచెప్పారు. శక్తి, ఆర్థిక బలంతో ప్రపంచాన్ని మీరు శాసించే రోజులు పోయాయని ట్రంప్ కు తెలిపారు. ఈ మేరకు ట్రంప్ తో పాటు ఒప్పందం కుదుర్చుకున్న కేంద్రానికీ రాహుల్ చురకలు అంటించారు. ఇండియా కూటమి అధికారంలో ఉండి ఉంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను భారత్ ను తమ బానిసగా

- మిగతా2లో

## పునరుద్ధరణ దశ దాటి..

## ప్రగతి వైపు పరుగులు

- పేదలకు ఏటా రూ.33 వేల కోట్ల నగదు బదిలీ
- అమరావతి శాశ్వత రాజధానిగా కేంద్రం చట్టం
- ఏఐ, క్వాంటమ్‌తో రాష్ట్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు
- విద్యుత్ ఛార్జీలు తగ్గించాం
- విశ్వవిపణిలోకి మన ఎగుమతులు
- గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉద్ఘాటన
- ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగం

**ఎన్టీఆర్ భరోసా కింద 63.12 లక్షల మంది పింఛన్‌దారులు లబ్ధి పొందుతున్నారు. పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పీ4 కింద లక్ష మందికి పైగా మార్గదర్శులు 10.30 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. స్వయం ఉపాధి చర్యల ద్వారా ఈ ఏడాది లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. 1990లలో ఐటీ ద్వారా హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చినట్లే ఇప్పుడు ఏఐ, క్వాంటమ్ సాంకేతికతతో అమరావతిని ఆ స్థాయికి తీసుకెళ్తున్నాం.**





అమరావతి: 'రాష్ట్ర విభజన విసిరిన సవాళ్లను ఎదుర్కొంటూ పురోగతి వైపు వేస్తున్న అడుగులకు 2019లో ప్రభుత్వ మార్పు ద్వారా విఘాతం కలిగింది. గత ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో సంక్షోభం ఏర్పడింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన ఎన్డీయే.. విధ్వంసం నుంచి ఏపీని పునరుద్ధరించే చర్యలు చేపట్టింది. ఇప్పుడు ఆ దశ కూడా దాటి పురోగతి వైపు స్పష్టమైన, దృఢమైన ప్రయాణాన్ని ప్రారంభించింది. పునర్‌నిర్మాణం, పునరుద్ధరణ, అభ్యుదయం అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం' అని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉద్ఘాటించారు. సూపర్ సిక్స్ హామీల అమలు ద్వారా ఏటా రూ.33 వేల కోట్ల నగదును ప్రత్యక్షంగా లబ్ధిదారులకు బదిలీ చేస్తున్నామని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమంగా నిలిచిందని వెల్లడించారు. రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తించేందుకు చట్టం తెచ్చే ప్రక్రియను ప్రారంభించడంతో పాటు నిర్మాణ

- మిగతా2లో

## విశాఖలో దివ్యాంగుల క్రీడాకేంద్రం ఏర్పాటుకు సహకరించండి

### కేంద్రమంత్రి వీరేంద్రకుమార్‌కు తెదేపా ఎంపీ లావు వినతి



విశాఖపట్నంలో దివ్యాంగుల క్రీడాకేంద్రం ఏర్పాటుకు కేంద్రం ఆర్థికపరంగా, అనుమతుల పరంగా సహకరించాలని

- మిగతా2లో

## అసెంబ్లీలో కొత్త టెక్నాలజీ...

## సీట్లో కూర్చుంటేనే అటెండెన్స్!

- ఏపీ అసెంబ్లీలో రేపటి నుంచి ఏఐ ఆధారిత హాజరు విధానం
- సభ్యులు తమ సీట్లలో కూర్చుంటేనే అటెండెన్స్ నమోదు
- కొత్త విధానాన్ని అధికారికంగా ప్రకటించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- 2028 డిసెంబర్ నాటికి కొత్త అసెంబ్లీ భవనం సిద్ధమవుతుందని వెల్లడి
- వైసీపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఆసక్తికర వ్యాఖ్యలు



- మిగతా2లో



## ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటి సీఎం ఫోటో తో మీకొచ్చిన బాదేంటి సుప్రీంకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 11: ఆంధ్రప్రదేశ్ లోని, ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోటోలు ప్రదర్శించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేయడంతో రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చకు

- మిగతా2లో


## 11వ తేదీ..11 మంది..11 నిమిషాలు ఉండి

## వెళ్లిపోయారుగా

- సభలో అంతకుమించి లేరుగా!
- వైసీపీ సభ్యులపై స్పీకర్ అయ్యన్న సరదా వ్యాఖ్య
- గవర్నర్ ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగించిన వైసీపీ ఎమ్మెల్యేలు
- ప్రసంగం కొనసాగుతుండగానే జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేల వాకౌట్
- 11వ తేదీన 11 నిమిషాలకు మించి వారు సభలో లేరన్న అయ్యన్నపాత్రుడు

- మిగతా2లో

అమరావతి, ఫిబ్రవరి 11: అమరావతిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం ప్రారంభమవగా.. కేవలం 11 నిమిషాల్లోనే వైసీపీ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. ఉదయం 10:00 గంటలకు సభ మొదలైన వెంటనే గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం




## వందేమాతరం తర్వాతే

## జనగణమన

### ఆలాపనపై కేంద్ర హోంశాఖ ఆదేశం



దిల్లీ: అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం జనగణమన ఆలపించడానికి ముందే జాతీయ గేయం వందేమాతరంలోని 6 చరణాలను పాడాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రపతి పాల్గొనే, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే, గవర్నర్లు మాట్లాడే కార్యక్రమాల్లో తొలుత 3 నిమిషాల 10 సెకన్లు ఉండే వందేమాతరంలోని 6 చరణాలను ఆలపించాలని సూచిస్తూ గత నెల 28వ తేదీన కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'రెండింటినీ ఆలపించాల్సిన సమయంలో వందేమాతరాన్నే

- మిగతా2లో



## 20 నెలల పాలన.. 60 విజయాలు..

## ప్రజలకు వివరించండి

### కూటమి నేతలకు జాబితా ఇచ్చిన సీఎం చంద్రబాబు

- ఎన్డీఏ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు సమావేశం
- 20 నెలల పాలనలో సాధించిన విజయాలను వివరించిన సీఎం
- విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగతి సాధించామన్న చంద్రబాబు
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు పిలుపు
- 60 ప్రధాన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల జాబితా విడుదల

ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజున అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. గడిచిన 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగమిస్తోందని, ప్రతి రంగంలోనూ వృద్ధి నమోదైందని తెలిపారు. ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకుంటూ అతి తక్కువ కాలంలోనే ప్రజలు మెచ్చే పాలన అందించామని చంద్రబాబు అన్నారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు.

- మిగతా2లో

## బాబ్రీ నిర్మాణం ఎన్నటికీ జరగదు..

- ఖయామత్ వరకు వేచి చూసినా ఉపయోగంలేదన్న సీఎం
- అయోధ్య రామాలయంపై చెప్పింది చెప్పినట్టే చేసి చూపించామని వ్యాఖ్య
- భారతదేశంలో సనాతన ధర్మం ఇమిడిపోయిందన్న యూపీ సీఎం

- మిగతా2లో



# పునరుద్ధరణ దశ దాటి.. ప్రగతి వైపు పరుగులు

-మొదటిపేజీ తరువాయి

పనులకు కేంద్రం ఆర్థికంగా సహకరిస్తోందని తెలిపారు. బుధవారం రాష్ట్ర ఉభయ చట్టసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఆయన మాటల్లోనే..

**రాష్ట్రాన్ని ఇలా నిలబెట్టాం..**

వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు, సామాజిక విధ్వంసం, తీవ్ర ఆర్థిక ఒత్తిడి, శాంతి భద్రతల క్షీణత, అరాచకత్వం, సెక్షన్ 22ఏ దుర్వినియోగం వంటి విపరిణామాలు గత ప్రభుత్వంలో చోటు చేసుకున్నాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగునీటి పారుదల రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయి. 2024లో ప్రజలు ఎన్డీయే ప్రభుత్వానికి పట్టం కట్టడంతో పునరుద్ధరణ నుంచి ప్రగతిపథం వైపు ప్రభుత్వం క్రమబద్ధమైన మార్గంలో పయనిస్తోంది. సంక్షేమం, అభివృద్ధి, భావి అవసరాల దృష్ట్యా ప్రణాళికలు రచించి అమలు చేస్తోంది. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.308 లక్షల కోట్లకు ఎదుగుతుంది. ప్రజల తలసరి ఆదాయం రూ.55 లక్షలు లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ రూపొందించుకున్నాం. పథకాల అమల్లో జవాబుదారీతనానికి మంత్రులు, కార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేశాం.

**పేదలకు ఆర్థిక చేయూత**

ఎన్టీఆర్ భరోసా కింద 63.12 లక్షల మంది పింఛన్‌దారులు లబ్ధి పొందుతున్నారు. తల్లికి వందనం కింద 66 లక్షలకు పైగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించగా, ఇప్పటికే 37.8 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. అన్నదాతా సుఖీభవ కింద 46.86 లక్షల మంది రైతులకు ఏటా రూ.22 వేల కోట్ల ఆర్థిక సాయం చేస్తున్నాం. దీపం 2.0 కింద 1.08 కోట్ల పేద కుటుంబాలకు

ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. 2.90 లక్షల మంది ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. 1.2 లక్షల మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచాం. లక్షకు పైగా చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు, మరమగ్గాలపై పనిచేసే కుటుంబాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ప్రభుత్వ పథకాల లబ్ధి, అర్హతలు తెలుసుకునేలా ఫ్యామిలీ కార్డు ప్రవేశపెడుతున్నాం.

పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పీ4 కింద లక్ష మందికి పైగా మార్గదర్శులు 10.30 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. స్వయం ఉపాధి చర్యల ద్వారా ఈ ఏడాది లక్ష మంది

మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. అన్న క్యాంటీన్లలో పేదలకు తక్కువ ధరకే పౌష్టికాహారం అందిస్తున్నాం. 'అందరికీ ఇల్లు' లక్ష్యంతో గృహాలు నిర్మిస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది ఉపాధ్యాయులను నియమించాం. 5,757 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం.

**ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు**

పౌరుల డిజిటల్ ఆరోగ్య రికార్డులు సురక్షితంగా పొందేందుకు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. రోగులకు చికిత్సతో పాటు సంపూర్ణ ఆరోగ్యం, రోగ నిరోధక శక్తిపై దృష్టి సారించేలా సంజీవని కార్యక్రమాన్ని రూపొందించాం. ప్రతి వ్యక్తికి రూ.25 లక్షల సమగ్ర ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. నాటుసారాను నిర్మూలించగా, గంజాయి కట్టడిలో గణనీయ పురోగతి సాధించాం. ఏపీని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మారుస్తాం.

**నదుల అనుసంధానానికి ప్రాధాన్యం**

పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌కు ముందే పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నాం. నదుల అనుసంధానం చేపడతాం. 2027 గోదావరి పుష్కరాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రాలుగా సమీకృత వృద్ధి ప్రాంతాలను మెరుగు పరుస్తాం. విజయవాడ-గుంటూరు-అమరావతి క్లస్టర్.. రవాణా పరంగా నైపుణ్యాల కేంద్రంగా, మెరుగైన టైర్-2 పట్టణ సముదాయంగా ఆవిర్భవిస్తోంది. విశాఖ ఆర్థిక నడవా పనులు ప్రారంభమయ్యాయి. విశాఖ, విజయవాడ మెట్రో రైలు వ్యవస్థల అభివృద్ధిని వేగవంతం చేశాం.

**అమరావతికి అరుదైన గుర్తింపు**

అమరావతి క్వాంటమ్ వ్యాలీ ద్వారా ఏడాది పొడవునా క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. ప్రపంచంలో క్వాంటమ్ సేవలు అందించే అతికొద్ది ప్రాంతాల్లో ఒకటిగా అమరావతి నిలుస్తుంది.

# ఇండియాను అమ్మేశారు

-మొదటిపేజీ తరువాయి

కాకుండా సమానంగా చూడాలని చెప్పేదని రాహుల్ గాంధీ తెలిపారు. అమెరికాతో కుదిరింది ఒక వికృత ఒప్పందం అన్నారు. భారత్-అమెరికా ఇద్దరూ వాణిజ్య ఒప్పంద నిబంధనలు ఖరారు చేయకుండా ట్రంప్ కు ఏకపక్షంగా ఈ అవకాశం ఇచ్చినందుకు కేంద్రం పై రాహుల్ నిప్పులు చెరిగారు. ఇది అమెరికాతో భారత్ చర్చలు జరిపే అవకాశాన్ని బలహీనపర్చిందన్నారు. ట్రంప్ కు మూడు విషయాల్లో రాహుల్ ఈ సందర్భంగా మూడు సందేశాలు పంపారు. ఇందులో అతి ముఖ్య మైన విషయం భారతీయ డేటా అన్నారు. ఇండియా కూటమి ట్రంప్ తో చర్చలు జరుపుతుంటే, తాము మొదట చెప్పేది ఏమిటంటే, మీరు మీ డాలర్ ను కాపాడుకోవాలనుకుంటే, మేము మీ స్నేహితులం, మీ డాలర్ ను కాపాడుకోగల అతిపెద్ద ఆస్తి భారతీయ ప్రజలతో ఉంది. మీరు ఈ డేటాను యాక్సెస్ చేయాలనుకుంటే, దయచేసి మీరు మాతో సమానంగా మాట్లాడబోతున్నారని అర్థం చేసుకోండి. మేము మీ సేవకులమని మీరు మాతో మాట్లాడబోవడం లేదన్నారు. రెండవది భారతదేశం తన ఇంధన భద్రతను కాపాడుకుని ఉండాల్సిందని రాహుల్ తెలిపారు. కొత్త వాణిజ్య ఒప్పందం ప్రకారం భారత్ తన రష్యన్ చమురు కొనుగోళ్లను ఆపడానికి అంగీకరించిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యను రాహుల్ గుర్తు చేశారు. మూడో విషయం రైతుల సమస్య అన్నారు. ట్రంప్ కూ ఓటర్లు ఉన్నారని, తమ రైతులను రక్షించు కోవాల్సిన అవసరం ఉందని ఆయన భావిస్తున్నట్లు తమకు అర్థమవుతోందని, కానీ తామూ తమ రైతులను కూడా రక్షించుకోవాల్సి ఉందన్నారు. తాము ఈ విషయంలో పాకిస్తాన్ తో సమానంగా ఉండలేమన్నారు. ఇప్పుడు మనం ఎవరి నుండి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తుందని, మన ప్రధానమంత్రి కాదని రాహుల్ విమర్శించారు. మీరు భారతదేశాన్ని అమ్మేశారంటూ ప్రధాని మోదీ ని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు. మీకు భారతదేశాన్ని అమ్మడానికి సిగ్గు లేదా?, మీరు మన తల్లి భరతమాతను అమ్మేశారన్నారు. ప్రధాని కళ్లలో ఈ మేరకు భయం కనిపిస్తోందన్నారు.

# 20 నెలల పాలన.. 60 విజయాలు.. ప్రజలకు వివరించండి

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా, 20 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన 60 ప్రధాన కార్యక్రమాలు, సాధించిన విజయాల జాబితాను సీఎం వివరించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

1. తల్లికి వందనం: రూ.10,090 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ. 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం.
2. స్త్రీ శక్తి: 43.51 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు. రూ.1,532 కోట్లు ఖర్చు.
3. దీపం 2 పథకం: 1.08 కోట్ల కుటుంబాలకు ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్ల పంపిణీ. ఇప్పటికి 3.64 కోట్ల సిలిండర్లు అందజేత, రూ.2,891 కోట్లు వ్యయం.
4. అన్నదాత సుఖీభవ: 46.86 లక్షల మంది రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున సాయం. రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ.
5. ఎన్టీఆర్ భరోసా: నెలకు 63 లక్షల మందికి పింఛన్లు. ఇప్పటికి రూ.58,654 కోట్లు వ్యయం.
6. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఎక్కడైనా పింఛను తీసుకునే అవకాశం.
7. మత్స్యకార భరోసా: ఏడాదికి రూ.20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు.
8. నేతన్నలకు ఉచిత విద్యుత్: మరమగ్గాలకు 500, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్. లక్షకు పైగా కుటుంబాలకు లబ్ధి.
9. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 సాయం. రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి.
10. అన్న క్యాంటీన్లు: 113 నియోజకవర్గాల్లో 205 క్యాంటీన్ల ద్వారా 7.50 కోట్ల భోజనాలు.
11. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్.
12. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ, అన్ని వర్గాలకు సమన్యాయం.
13. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం.
14. ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజన్లకు రూ.5,000 గౌరవ వేతనం.
15. అర్చకులకు వేతనం రూ.15,000కు పెంపు. నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000, జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం.
16. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీకి తొలి సంతకం.
17. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి. స్టైఫండ్ రూ.12,500కు పెంపు.
18. రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు.
19. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు. బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు.
20. ప్రతీ నెలా 3వ శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'. చెత్తపన్ను రద్దు.
21. రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు, రూ.3,000 కోట్లతో నూతన రహదారులు.
22. కొత్తగా 25 పారిశ్రామిక పాలసీలు, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు.
23. విశాఖ సీఐఐ సమ్మిట్‌లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు.
24. 14 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం, 8.36 లక్షల ఉద్యోగాలు.
25. విశాఖలో రూ.1.25 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు.
26. అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన. విశాఖలో టీసీఎస్ ప్రారంభం.
27. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన.
28. తిరుమల సహా ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు.
29. విశాఖలో యోగాంధ్ర, కర్నూలులో సూపర్ జీఎస్టీ సభ విజయవంతం.
30. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు, పేదలకు అదనంగా 110 వైద్య విద్య సీట్లు.
31. గ్రామ సభల ద్వారా 3 వేల పనులకు శ్రీకారం, పంచాయతీలకు నిధుల విడుదల, అమరజీవి జలధార పథకం.
32. విద్యా వ్యవస్థలో మార్పులు, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం.
33. గేట్స్ ఫౌండేషన్, టాటాలతో సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ ప్రతిపాదన.
34. విద్యుత్ చార్జీల పెంపు లేదని ప్రకటన, ట్రూ అప్ భారాన్ని భరిస్తున్న ప్రభుత్వం.
35. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతానికి చేరిక.
36. పేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తుల స్వీకరణ, 3 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు.
37. ఉచిత ఇసుక పథకం అమలు, నాలా యాక్ట్ రద్దు.
38. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్.
39. తగ్గిన క్రైమ్ రేట్, గంజాయి-డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ టాస్క్ ఫోర్స్.
40. మన మిత్ర ద్వారా వాట్సప్ గవర్నెన్స్‌తో 921 సేవలు.
41. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ.
42. పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆస్కారం.
43. విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం పనుల ప్రారంభం.
44. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల కేంద్ర సాయం.
45. 90 కేంద్ర పథకాల పునరుద్ధరణ, నిధుల సద్వినియోగం.
46. రాష్ట్రానికి రూ.1 లక్ష కోట్ల విలువైన నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులు.
47. కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటుతో మొత్తం 28 జిల్లాలు.
48. మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ.
49. రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో రైతులకు రూ.8,120 కోట్లు జమ.
50. మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో వివిధ పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం.
51. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు పెరిగిన భూగర్భ జలాలు.
52. సాగునీటి ప్రాజెక్టులకు 20 నెలల్లో రూ.23,793 కోట్ల ఖర్చు.
53. హంద్రీనీవా పనులు పూర్తి చేసి సీమకు 43 టీఎంసీల తరలింపు.
54. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.571 కోట్లు వ్యయం.
55. శరవేగంగా పోలవరం నిర్మాణం, 2027 పుష్కరాలకు ప్రారంభం.
56. తుంగభద్ర గేట్ల మరమ్మతులకు ఏపీ వాటాగా రూ.55 కోట్లు.
57. రూ.610 కోట్లతో వివిధ ప్రాజెక్టుల మరమ్మతులు, రూ.878 కోట్లతో కాలువల నిర్వహణ.
58. 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు.
59. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం మీదుగా 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు.
60. ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు సంక్షేమ ఫలాలు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం ఫోటో తో మీకొచ్చిన బాధేంటి సుప్రీంకోర్టు

-మొదటిపేజీ తరువాయి

దారితీసింది. విజయవాడకు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఏము కొండలరావు ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. డిప్యూటీ సీఎం పదవికి రాజ్యాంగ హోదా లేదని పిటిషనర్ తరఫున లాయర్ వాదనలు వినిపించారు. అయినా సరే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో డిప్యూటీ సీఎం ఫోటోను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఇలా చేయడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం జరుగుతోందన్నారు. ఈ వాదనల్ని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్‌వీ అంజారియా, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది.. అలాగే ఈ పిటిషన్‌ను కొట్టేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో ప్రదర్శిస్తే.. మీకొచ్చిన బాధేంటి అంటూ పిటిషనర్‌ను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. దీంతో మీకేం సమస్య ఉంది.. ఇష్యూస్ సెటిల్ చేసుకోవడానికి ప్రయత్నించొద్దు అంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

## బాబ్రీ నిర్మాణం ఎన్నటికీ జరగదు..

బాబ్రీ మసీదు నిర్మాణం ఇక ముగిసిన కథేనని, మసీదు పునర్నిర్మాణం ఎన్నటికీ జరగదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తేల్చిచెప్పారు. అలాంటి ఆశలు ఎవరికైనా ఉంటే తుడిచేసుకోవాలని హితవు పలికారు. ఖయామత్ (ప్రపంచం అంతమయ్యే రోజు) వచ్చే వరకూ ఎదురుచూసినా సరే వారి కలలు కల్లలుగానే మిగిలిపోతాయని స్పష్టం చేశారు. ఆ రోజు కోసం ఎదురుచూసేవారు అలాగే కుళ్ళిపోతారని, కానీ అలాంటి రోజు ఎప్పటికీ రాదని ఎద్దేవా చేశారు. అయోధ్యలో రామమందిరం నిర్మిస్తామని చెప్పాం.. చెప్పినట్లుగానే అదే చోట రాముడి గుడి కట్టామని యోగి గుర్తుచేశారు. భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు, సనాతన ధర్మం ఎన్నటికీ నిలిచి ఉంటాయని చెప్పారు. భారత్ లో సనాతన ధర్మం కలగలిసిపోయిందని, వాటిని వేరు చేయాలన్న ప్రయత్నం ఎన్నటికీ నెరవేరదని అన్నారు. దేశంలో కాషాయ జెండా రెపరెపలు కొనసాగుతూనే ఉంటాయని, దేశ గౌరవాన్ని అది ఇనుమడిస్తుందని యోగి పేర్కొన్నారు. అయోధ్య రామాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ కాషాయ జెండా ఎగరవేయడం సనాతన ధర్మానికి ప్రతీక అని కొనియాడారు. ఈ సందర్భంగా అవకాశవాదుల గురించి యోగి తన ప్రసంగంలో ప్రస్తావించారు. కొందరికి కష్టాల్లోనే రాముడు గుర్తుకు వస్తాడని, వారిని ఆ రాముడు కూడా మర్చిపోతాడని ఎద్దేవా చేశారు. ఉత్తరప్రదేశ్ లో 2017 నాటి కల్లోల పరిస్థితులను ప్రస్తావిస్తూ.. అప్పట్లో ప్రతీ నాలుగైదు రోజులకు రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట అల్లర్లు జరిగేవని, కర్ఫ్యూ విధించాల్సి వచ్చేదని గుర్తుచేశారు.ప్రస్తుతం ఆ పరిస్థితి మారిందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్నాయని తెలిపారు. చట్టాలను గౌరవిస్తూ నడుచుకునే వారు లబ్దిపొందుతారని, అతిక్రమించేవారు నరకానికి వెళతారని సీఎం యోగి హెచ్చరించారు. దేశంపై, సనాతన ధర్మంపై లోపలి నుంచి, బయట నుంచి దాడులు జరుగుతున్నాయని.. కొందరు కుట్రలు పన్నుతుంటే, మరికొందరు ఆ కుట్రలలో భాగంగా తమకు తాముగా అమ్ముడుపోతున్నారని యోగి ఆరోపించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏపీ అసెంబ్లీలో కొత్త టెక్నాలజీ... సీట్లో కూర్చుంటేనే ఆటెండెన్స్!

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గురువారం నుంచి సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి రానుంది. ఇకపై సభ్యులు తమకు కేటాయించిన సీట్లలో కూర్చుంటేనే వారి హాజరు నమోదవుతుంది. ఈ మేరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం వెల్లడించారు. ఈ బడ్జెట్ సమావేశాల నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.అసెంబ్లీలో మీడియాతో మాట్లాడిన అయ్యన్నపాత్రుడు, ఇప్పటివరకు రిజిస్టర్‌లో సంతకాల ద్వారా హాజరు నమోదు చేసే పద్ధతికి స్వస్తి పలుకుతున్నట్లు తెలిపారు. నూతన ఏఐ విధానం ద్వారా సభ్యుల హాజరును మరింత కచ్చితంగా, పారదర్శకంగా నమోదు చేసేందుకు వీలు కలుగుతుందని వివరించారు. పెద్ద కార్పొరేట్ సంస్థల సీఈఓలు సైతం బయోమెట్రిక్ విధానాన్ని వాడుతున్నారని, పార్లమెంట్‌లోనూ ఇలాంటి టెక్నాలజీని తీసుకురావాలని యోచిస్తున్నారని ఆయన గుర్తుచేశారు.ఈ సందర్భంగా, బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగానికి హాజరై వాకౌట్ చేసిన వైసీపీ ఎమ్మెల్యేల గురించి స్పీకర్ సరదాగా ప్రస్తావించారు. "11వ తేదీన 11 మంది వచ్చి 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు" అని ఆయన వ్యాఖ్యానించారు.అలాగే, 2028 డిసెంబర్ నాటికి అమరావతిలో దేశంలోనే అత్యుత్తమమైన కొత్త అసెంబ్లీ భవనం సిద్ధమవుతుందని స్పీకర్ తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే, 300 మందికి పైగా సభ్యులు కూర్చునేలా దీనిని నిర్మిస్తామని ఆయన వివరించారు. ఈ కొత్త విధానంతో సభా కార్యకలాపాల్లో సభ్యుల భాగస్వామ్యం పెరుగుతుందని భావిస్తున్నారు.

## విశాఖలో దివ్యాంగుల క్రీడాకేంద్రం ఏర్పాటుకు సహకరించండి

-మొదటిపేజీ తరువాయి

తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ మంత్రి వీరేంద్రకుమార్‌ను కోరారు. బుధవారం ఇక్కడి పార్లమెంటు భవన్‌లో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. "దివ్యాంగుల క్రీడాకేంద్రం ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం విశాఖపట్నం జిల్లా బక్కన్నపాలెంలో 22.64 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించింది. 2025 మార్చిలోనే కేంద్ర అధికారులు దాన్ని పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వం సహకరిస్తున్నందున.. త్వరగా ఏర్పాటుచేసేందుకు వీలుగా కేంద్రం నుంచి ఆర్థికసాయం, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలి" అని శ్రీకృష్ణదేవరాయలు కేంద్రమంత్రికి విజ్ఞప్తిచేశారు.

## వందేమాతరం తర్వాతే జనగణమన

-మొదటిపేజీ తరువాయి

ముందుగా పూర్తి చేయాలి' అని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ లేచి నిల్చోవాలని సూచించింది. అయితే న్యూస్‌రీల్స్, డాక్యుమెంటరీలు, సినిమాల్లో భాగంగా వందేమాతరం ఆలాపన వచ్చినప్పుడు నిల్చోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

పాఠశాలల్లో వందేమాతరంతోనే కార్యకలాపాలను ప్రారంభించాలని కేంద్ర హోంశాఖ సూచించింది.

దేశభక్తితో, మాతృభూమిపై ప్రేమతో, మర్యాదపూర్వకంగా.. సముచిత పద్ధతిలో ఏ కార్యక్రమంలోనైనా వందేమాతరాన్ని ఆలపించొచ్చని, దానిపై అభ్యంతరం ఉండదని స్పష్టం చేసింది.

దేశ గౌరవానికి చిహ్నాలైన జాతీయ గీతం, గేయం ఆలాపన జరుగుతున్నప్పుడు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగించినా, అగౌరవపరిచినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. కొత్త నిబంధనల ప్రకారం, ఇటువంటి చర్యలకు పాల్పడే వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

## 11వ తేదీ..11 మంది..11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా సభకు హాజరైన వైసీపీ సభ్యులు.. కాసేపటికే నిరసన తెలుపుతూ బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటన పై అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సరదా వ్యాఖ్యలు చేశారు. గవర్నర్‌కు వీడ్కోలు పలికి తిరిగి వచ్చే సమయంలో మీడియా ప్రతినిధులతో సభాపతి మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు 11 వ తేదీన.. 11 మంది ఎమ్మెల్యేలు వచ్చి.. 11 నిమిషాలు మాత్రమే ఉండి సభ నుంచి వెళ్లిపోయారు. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా అని అన్నారు. సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తే మంచిదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. కేవలం చమత్కారానికే పరిమితం కాకుండా, గౌరవ సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తే మంచిదని ఈ సందర్భంగా స్పీకర్ సూచించారు. గవర్నర్ ప్రసంగం అనేది రాజ్యాంగబద్ధ మైన ప్రక్రియ అని, దానిని గౌరవించాల్సిన బాధ్యత అందరి పై ఉందని ఆయన గుర్తు చేశారు. కాగా, ఈరోజు అసెంబ్లీ సమావేశాలకు వైఎస్ జగన్ సహా వైసీపీ సభ్యులు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెడికల్ కాలేజీల్లో పీపీపీ పద్ధతిని రద్దు చేయాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలని, వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు.

# టాయిలెట్ పేపర్ లా వాడేసి విసిరేశారు

అమెరికా పై రగిలిపోతున్న పాకిస్తాన్..

**పాకిస్తాన్: పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** భారత్-పాకిస్తాన్ మధ్య శత్రుత్వాన్ని వాడుకుంటూ అమెరికా చేసే రాజకీయాలు ఎలా ఉంటాయన్నది పలు సందర్భాల్లో నిరూపిత మైంది. తాజాగా గతేడాది భారత్ లోని పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో మధ్యవర్తిగా ఎంట్రీ ఇచ్చి ఇద్దరి మధ్య కాల్పుల విరమణ చేయించినట్లు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకున్నారు. ఈ వాదనతో భారత్ ఏకీభవించకపోవడం, తాము అడగ్గానే కాల్పుల విరమణకు సహకరించడంతో ట్రంప్ కు పాక్ దగ్గరైంది. ఆ తర్వాత భారత్ పై భారీ సుంకాలు విధించి, పాకిస్తాన్ పాలకులతో ట్రంప్ విందులు చేసుకున్నారు. దీంతో పాకిస్తాన్ కూడా ఇక అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుని భారీ ఎత్తున ప్రయోజనం పొందాలని, తద్వారా భారత్ తో ట్రంప్ బంధానికి బీటలు వారతాయని లెక్కలేసుకుంది. కానీ సీన్ రివర్స్ అయింది. భారత్ వంటి భారీ మార్కెట్ ను వదులుకుని, నానాటికీ ఆర్థికంగా బీటలు వారుతున్న పాకిస్తాన్ కు అండగా నిలిచేందుకు ట్రంప్ నో చెప్పేశారు. దీని ఫలితమే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం. ఈ ఒప్పందం ఇచ్చిన షాక్ నుంచి పాక్ ఇప్పటికీ కోలుకోలేకపోతోంది. దీంతో అమెరికా తమను వాడుకుని టాయిలెట్ పేపర్ లా విసిరేశారని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అమెరికాతో తమకు ఉన్న బంధాన్ని ఆయన అంగీకరించారు. అమెరికా తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని దోపిడీ చేసిందని, వాళ్ల లక్ష్యాలు నెరవేరాక టాయిలెట్ పేపర్ ముక్కలాగా విసిరేసిందని ఆయన ఆరోపించారు. పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీలో మాట్లాడుతూ తమ దేశం తరచూ తమకున్న ఉగ్రవాద చరిత్రను తిరస్కరిస్తుందని, కానీ ఇది గతంలో నియంతలు చేసిన తప్పు అని అంగీకరించారు. అలాగే రెండు ఆఫ్ఘన్ యుద్ధాలలో పాకిస్తాన్ భాగస్వామి కావడాన్ని కూడా మరో తప్పుగా అభివర్ణించారు. ఇవాళ పాకిస్తాన్‌లో జరుగుతున్న ఉగ్రవాద ఘటనలు తమ గత తప్పులకు ప్రతిఫలమని అంగీకరించారు. 1999 తర్వాత ఆఫ్ఘనిస్తాన్ విషయంలో అమెరికా-పాకిస్తాన్ కలిసి పనిచేయడం తమ దేశానికి శాశ్వత నష్టాన్ని మిగిల్చిందని ఖవాజా పేర్కొన్నారు. 2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికాతో తిరిగి పొత్తు పెట్టుకోవడం వల్ల కలిగిన నష్టాలు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ ముక్క కంటే దారుణంగా చూశారని, దానిని తమ ప్రయోజనాల కోసం వాడుకుని విసిరేశారని విమర్శించారు.



# ట్రంప్ కోసం గొడవ.. కూతురిని కాల్చి చంపిన తండ్రి!





**అమెరికా: పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** రాజకీయ విభేదాలు, వ్యక్తిగత అభిప్రాయాలు ఒక్కోసారి ఎంతటి అనర్థాలకు దారితీస్తాయో చెప్పడానికి టెక్సాస్ లో జరిగిన ఈ ఘటనే నిదర్శనం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తుపాకుల వాడకం పై తండ్రీ కూతుళ్ల మధ్య జరిగిన చిన్నపాటి వాగ్వాదం చివరకు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తనను చూడటానికి వచ్చిన కన్నకూతురినే ఓ తండ్రి తుపాకీతో కాల్చి చంపిన ఘటన ఇప్పుడు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. బ్రిటన్ లోని చెషైర్‌కు చెందిన లూసీ హారిసన్ (23) ఓ ఫ్యాషన్ బయర్ గా పనిచేస్తోంది. చాలా కాలం తర్వాత తన తండ్రి క్రిస్ హారిసన్ ను కలిసేందుకు ఆమె తన ప్రియుడు సామ్ లిటిలర్‌తో కలిసి టెక్సాస్ లోని ప్రాస్పర్ నగరానికి వెళ్లింది. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న సమయంలో డొనాల్డ్ ట్రంప్ రాజకీయాలు, అమెరికాలోని తుపాకీ సంస్కృతి గురించి తండ్రీకూతుళ్ల మధ్య చర్చ మొదలైంది. ఈ చర్చ కాస్తా వాగ్వాదంగా మారింది. మనసు గాయపరిచిన తండ్రి మాటలు ట్రంప్ చుట్టూ ఉన్న లైంగిక వేధింపుల వివాదాల గురించి ప్రస్తావిస్తూ.. ఒకవేళ నేను ఆ పరిస్థితిలో ఉండి వేధింపులకు గురైతే మీరు ఎలా ఫీల్ అవుతారు? అని లూసీ తన తండ్రిని సూటిగా ప్రశ్నించింది. దానికి తండ్రి క్రిస్ అత్యంత నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ.. నాకు మరో ఇద్దరు కూతుళ్లు ఉన్నారు, అది నన్ను అంతగా బాధించదు అని వ్యాఖ్యానించాడు. కన్న తండ్రి నోటి నుంచి వచ్చిన ఆ మాటలు లూసీని తీవ్రంగా గాయపరిచాయి. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఏడుస్తూ పై అంతస్తు లోకి వెళ్ళిపోయింది. 15 సెకన్ల వ్యవధిలో విషాదాంతం తండ్రి వద్ద తుపాకీ ఉండటం లూసీకి మొదటి నుంచీ ఇష్టం లేదు. దీని పై గతంలో కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేసేది. ఘటన జరిగిన రోజు లూసీ కిచెన్‌లో ఉండగా, క్రిస్ ఆమె చేయి పట్టుకుని తన బెడ్ రూమ్ లోకి తీసుకెళ్లాడు. లూసీ ప్రియుడు సామ్ బయట ఉండగా కేవలం 15 సెకన్ల వ్యవధిలోనే గదిలో నుంచి ఒక పెద్ద శబ్దం వినిపించింది. సామ్ పరిగెత్తుకుంటూ వెళ్లి చూసేసరికి లూసీ రక్తపు మడుగులో పడి ఉంది. తుపాకీ తూటా ఆమె ప్రాణాలను తీసేసింది. మద్యం మత్తులో తండ్రి ఘాతుకం కుటుంబ రక్షణ కోసమే తాను తుపాకీ కొన్నానని, ఆ రోజు కేవలం లూసీకి దాన్ని చూపించడానికి మాత్రమే తీశానని క్రిస్ కోర్టులో వాదించాడు. తనకు తెలియకుండానే గన్ పేలిందని, తన వేలు ట్రిగ్గర్ పై ఉందో లేదో కూడా గుర్తులేదని బుకాయించాడు. అయితే, క్రిస్ కు గతంలో మద్యపాన వ్యసనం ఉందని, ఘటన జరిగిన రోజు కూడా ఆయన సుమారు 500 మి.లీ వైన్ తాగినట్లు విచారణలో తేలింది. నా కూతురిని కోల్పోయిన బరువును నా జీవితాంతం మోయాల్సిందే అని ఆయన కోర్టులో వాపోయాడు. ఈ ఘటన కేవలం ఒక హత్య మాత్రమే కాదు, మితిమీరిన గన్ కల్చర్, రాజకీయ మూర్ఖత్వం కుటుంబ బంధాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో చెప్పడానికి ఒక చేదు నిదర్శనం.

# గ్రూప్ 1 పరీక్షల అక్రమాలు చోటు చేసుకున్నాయని హైకోర్టులో కేసు



**అమరావతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11::** ఏపీలో ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్షలు రాసిన అభ్యర్థులకు ఇవాళ భారీ షాక్ తగిలింది. గ్రూప్ 1 పరీక్షల మూల్యాంకలనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ల పై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం ఇవాళ సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఈ పరీక్షల్లో అక్రమాలకు కారణ మైనట్లు భావిస్తున్న మూల్యాంకనం విషయంలో హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. గ్రూప్ 1 పరీక్ష పై హైకోర్టులో పిటిషన్లు ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్షల మూల్యాంకనంలో జరిగిన అక్రమాల పై పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటి పై విచారణ జరిపిన హైకోర్టు.. అదనపు డీజీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేసి వీటి పై దర్యాప్తు చేయించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అలాగే మార్చి 16 లోపు ఈ దర్యాప్తు పూర్తి చేసి నివేదికను హైకోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే ఈ కేసు దర్యాప్తులో ఏపీకి చెందిన వారు కాకుండా బయట రాష్ట్రాల ఫోరెన్సిక్ నిపుణుల సాయం తీసుకోవాలని ఆదేశించింది.

జవాబు పత్రాల పై ఫోరెన్సిక్ దర్యాప్తు మరో వైపు అభ్యర్థులు రాసిన గ్రూప్ 1 జవాబు పత్రాల మూల్యాంకనం పై ఫిర్యాదుల నేపథ్యంలో వీటిని జాగ్రత్తగా ఉంచారా లేదా అని ఏపీపీఎస్సీని ప్రశ్నించింది. ఈ జవాబు పత్రాల భద్రతను నిర్దారించాలని ఆదేశాలు ఇచ్చింది. అలాగే వీటిని తారుమారు చేశారా లేదా అనే విషయాన్ని ఫోరెన్సిక్ దర్యాప్తు ద్వారా నిర్ధారించాలని సూచించింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఈ వ్యవహారం పై సిట్ ఏర్పాటు చేసి ఫోరెన్సిక్ సాయంతో జవాబు పత్రాల మార్ఫింగ్ ను నిర్ధారించాల్సి ఉంది. లేకపోతే ఈ పిటిషన్లు నిలబడే అవకాశం లేదు. మరో వైపు ఎంపికైన అభ్యర్థులందరి సమాధాన పత్రాలు చెక్కు చెదరకుండా ఉన్నాయా, ఏదైనా రూపంలో ట్యాంపరింగ్ జరిగిందా అనేది సిట్ పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే విజయవాడలో భౌతిక మూల్యాంకనం సమయంలో వాడిన పత్రాల పై ఉన్న బార్ కోడ్ లు, ఒరిజినల్ ఓఎంఆర్ షీట్‌లు, బార్‌కోడ్‌ల నుండి పొందిన డేటా ఎంపికైన అభ్యర్థులకు ఒకేలా ఉన్నాయా లేదా అనేది చూడాలి. ఎంపి కైన అభ్యర్థుల సమాధాన పత్రాలు, రిట్ పిటిషన్లలో పార్టీలుగా ఉన్న ఎంపిక కాని అభ్యర్థుల సమాధాన పత్రాల మూల్యాంకనం ఒకే పద్ధతిలో జరిగిందా లేదా తేల్చాలి. అలాగే మొదటి 100 లోపు ర్యాంకులు వచ్చిన అభ్యర్థుల సమాధాన పత్రాలు, మెరిట్ జాబితా లోని చివరి అభ్యర్థి తరువాత తక్కువ ర్యాంకును కలిగి ఉన్న అభ్యర్థుల సమాధాన పత్రాల మూల్యాంకనం ఒకే పద్ధతిలో జరిగిందా అనేది కూడా చూడాలని ఆదేశించింది. అలాగే తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎంపికైన అభ్యర్థులందరినీ నాన్-ఫోకల్ పోస్టుల్లో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

# నేడు భారత్ బంద్

నిలిచిపోనున్న రవాణా – విద్యా సంస్థలు, బ్యాంకులు..!!




**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** నేడు భారత్ బంద్ కు పలు సంఘాలు నిర్ణయించాయి. నేడు (గురువారం) భారత్ బంద్ నిర్వహించాలని కార్మిక, రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. రవాణా వ్యవస్థ నిలిచి పోనుంది. ఆటో డ్రైవర్ల సంఘాలు బంద్ కు మద్దతు ప్రకటించాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం, లేబర్ యాక్టులకు నిరసనగా దేశ వ్యాప్తంగా బంద్ కు నిర్ణయం తీసుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని కార్మిక – రైతు సంఘాలు ఈ బంద్ కు మద్దతు ప్రకటించాయి. బ్యాంకుల పైన ప్రభావం పడే అవకాశం ఉంది. విద్యా సంస్థల పైనా బంద్ ఎఫెక్ట్ పడే అవకాశం కనిపిస్తోంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ ఈ నెల 12 న భారత్ బంద్ నిర్వహించాలని రైతు సంఘం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు నిచ్చింది. ఆ సంఘం కన్వీనర్ హన్నన్ మొల్లా మీడియాతో మాట్లాడుతూ రెండు దేశాల వాణిజ్య ఒప్పందం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది భారత రైతుల పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. అమెరికా నేర్పరితనానికి భారత ప్రభుత్వం లొంగిపోయిందని ఆయన ఆరోపించారు. నేడు జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలుగు రాష్ట్రాల్లోని వామపక పార్టీల నేతలు పిలుపు నిచ్చాయి. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తుందని, నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు 3 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ – చట్టం- 2025, వీబీజి రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ ఐసీలో 100 శాతం విదేశీ పెట్టు బడులకు అనుమతించడం వంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు ఈ బంద్ కు పిలుపు నిచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష పార్టీలు, కార్మిక, విద్యార్థి అనుబంధం సంఘాలు బంద్ కు మద్దతు ప్రకటించాయి. ఇదే సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వెంకటేశం ఆరోపించారు. కార్మికుల నడ్డివిరిచే దుర్మార్గ మైన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 12 న నిర్వహించే జాతీయ సార్వత్రిక సమ్మెలో రవాణా రంగ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బ్యాంకు ఉద్యోగ సంఘాల నుంచి సానుకూల స్పందన కనిపిస్తోంది. దీంతో, బ్యాంకింగ్ సేవల పైనా ప్రభావం ఉండే అవకాశం ఉంది. ఇక పరీక్షల సమయం కావటంతో విద్యా సంస్థల విషయంలో అధికారికంగా నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## వందే మాతరం గీతం పై కేంద్రం సంచలన నిర్ణయం




**న్యూ దిల్లీ : పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** నరనరాల్లో దేశభక్తిని ఉప్పొంగింపజేసే వందే మాతరం గీతం పై కొత్త మార్గదర్శకాలు జారీ అయ్యాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వీటిని విడుదల చేసింది. సరైన మర్యాదను పాటిస్తూ గౌరవం ఇచ్చేలా మార్గదర్శకాలు ఉన్నాయి. ఈ గీతానికి సంబంధించిన అధికారిక వర్షన్ ఆలపించేటప్పుడు గానీ, వినిపించేటప్పుడు గానీ ఇక పై లేచి నిల్చోవడం తప్పనిసరి. శ్రోతలు అటెన్షన్‌లో లేచి నిల్చోవాలి. సామూహిక గీతాలాపనతో పాటు దీని పఠనం తప్పకుండా ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశించింది. సినిమా హాళ్లలో న్యూస్ రీల్స్ లేదా డాక్యుమెంటరీల సమయంలో ఇది ప్లే అయితే నిలబడాల్సిన అవసరం లేదు. అలాగే వందేమాతరంతో పాటు జనగణమన అధినాయక జయహే జాతీయ గీతం రెండింటినీ పాడాల్సి వచ్చిన సందర్భంలో అనుసరించాల్సిన విధి విధానాలు కూడా ఇందులో ఉన్నాయి. జనగణమన కంటే వందేమాతరాన్ని ముందుగా ఆలపించడం తప్పనిసరి అని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేశాయి.1937 లో తొలగించిన నాలుగు చరణాలతో సహా వందేమాతరం ఆరు చరణాలనూ కూడా పూర్తిగా ఆలపించాల్సి ఉంటుంది ఇక పై. అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం వేడుకలతో పాటు రాజ్యాంగాధిపతి అయిన రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాలలోనూ వందేమాతరం గీతాన్ని పూర్తిగా వినిపించాల్సి ఉంటుంది. రాష్ట్రపతి రాక, నిష్క్రమణ వేళలు పాఠశాలల్లో విద్యార్థులలో జాతీయ గేయం, వందేమాతరం గీతం, జెండా పట్ల గౌరవం పెంపొందించే ఏర్పాట్లు చేయాలని మార్గదర్శకాల్లో పొందుపర్చారు. వందేమాతరం గీతానికి అధిక ప్రాచుర్యం కల్పించే దిశగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇప్పుడు అన్ని అధికారిక కార్యక్రమాలలో కూడా ఆరు చరణాలతో 3:10 సెకన్ల నిడివి కలిగిన ఈ గీతాన్ని పాడటం లేదా అధికారిక వర్షన్ ను ప్లే చేయడం తప్పనిసరి. త్రివర్ణ పతాకావిష్కరణలు, రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాలకు హాజరైనప్పుడు అలాగే రాష్ట్రపతి ప్రసంగాలు, దేశీయ ఉపన్యాసాల వంటివి.. ఈ అధికారిక కార్యక్రమాల్లో ఉన్నాయి. బంకింఛంద్ర ఛటర్జీ రచించిన 1882 నాటి 'ఆనందమఠ్' నవలలో ఇది ప్రచురిత మైంది. స్వాతంత్ర్యానంతరం 1950 లో గేయం మొదటి రెండు చరణాలను భారతదేశ జాతీయ గేయంగా స్వీకరించారు. జనగణమన అధినాయక జయహే మాదిరిగా కాకుండా, వందేమాతరం ఆలపించడానికి ఇంతవరకు నిర్దిష్ట ప్రొటోకాల్ లేదనే విషయం తెలిసిందే. ఈ పరిణామాల మధ్య ప్రస్తుత మార్గదర్శకాలు వెలువడటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలసిన ఎమ్మెల్యేలు**



**అమరావతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11::** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పలువురు శాసన సభ్యులు, గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, శాసన మండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం, శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కలిశారు. తమ నియోజకవర్గాల పరిధి లోని గ్రామాల్లో పల్లె పండగ 2.0, సాస్కి నిధులతో రోడ్లు, డ్రెయిన్లతోపాటు జేజేఎం నిధులతో రక్షిత మంచినీటి పథకాల పనులు, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం శాసనసభలో జరిగిన ఎన్డీఏ ఎల్పీ భేటీ అనంతరం వీరంతా పవన్ కళ్యాణ్ ని కలిశారు. కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, మండపేట శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వర రావు, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు, అమలాపురం శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు ఉప ముఖ్యమంత్రి ని కలసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గాల పరిధిలో పలు సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. శ్రీకాళహస్తిలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బొజ్జల సుధీర్ రెడ్డి ఆహ్వానపత్రిక అందజేశారు.

## రైతు బజార్ ఆరోపణల పై విచారణ యార్లగడ్డ



**గన్నవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 11**: రైతు బజార్ లో అవినీతి జరుగుతుందంటూ వచ్చిన ఆరోపణల పై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. గన్నవరం రైతు బజార్ లో దుకాణాల కేటాయింపులో అవినీతికి పాల్పడుతున్నట్లు, టమాట, దుంపల విక్రయాలు ఓ వ్యక్తి కనుసన్నల్లో జరుగుతున్నట్లు కొన్ని చానళ్లలో కథనం ప్రసారమైంది. సదరు ఛానల్ లో వచ్చిన కథనాలకు స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ రైతు బజార్ లో జరుగుతున్న కార్యకలాపాల పై ఆరా తీశారు. దుంపల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయా లేదా అని అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సదరు ఛానల్లో వచ్చిన ఆరోపణల పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని, అక్రమాలున్నట్లు తేలితే బాధ్యుల పై తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. రైతులు, వినియోగదారుల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన రైతు బజార్లలో అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గన్నవరం నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు చోటు లేదని, అక్రమాలను ఎట్టి పరిస్థితులను సహించేది లేదని యార్లగడ్డ హెచ్చరించారు. గన్నవరం రైతు బజార్ నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు ఉంటే పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## నేడు పారిశుధ్య కార్మికుల సమ్మె.

- నివాసితులు వ్యర్థాలు బహిరంగ ప్రదేశాలలో వేయరాదు.
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** ఫిబ్రవరి 12 వ తేదీన అనగా నేడు గురువారం దేశవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నందున మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధి లోని ప్రజలు తమ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నగర ప్రజలకు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. జీవీఎంసీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు ఫిబ్రవరి 12 అనగా గురువారం సమ్మెలో పాల్గొంటున్న కారణంగా విధులకు హాజరు కానందున ఆరోజు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడవేయరాదని, మరుచటి రోజు అనగా ఫిబ్రవరి 13 శుక్రవారం తమ వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు లేదా క్లాప్ వాహనాలకు వ్యర్థాలను అందించగలరని జీవీఎంసీ కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అమెరికా ఉత్పత్తుల జాబితా నుంచి పప్పుధాన్యాల తొలగింపు




**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత్ పై సుంకాలను తగ్గించే లేదా తొలగించే క్రమంలో అమెరికా ఉత్పత్తుల జాబితా నుంచి పప్పుధాన్యాలను శ్వేతసౌధం తొలిగించింది. అలాగే భారత్ కు సంబంధించిన ఒక కీలక పదాన్ని కూడా మార్చింది. ఈ మేరకు తాత్కాలిక వాణిజ్య ఒప్పందం పై సవరించిన ఫాక్ట్ షీట్ ను విడుదల చేసింది. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంలో ఉండనున్న కీలక వివరాలతో వైట్‌హౌస్ సోమవారం అర్ధరాత్రి ఒక ఫ్యాక్ట్ షీట్ ను విడుదల చేసింది. అందులో భారత్ కొన్ని రకాల పప్పుధాన్యాల పై సుంకాలను తగ్గిస్తుందని శ్వేతసౌధం పేర్కొంది. ఆ తర్వాత మంగళవారం విడుదల చేసిన సవరించిన నివేదికలో ప్రస్తావనను తొలగించింది. నట్స్, సోయాబీన్ ఆయిల్, వైన్ వంటి జాబితా నుంచి పప్పుధాన్యాలను తొలగించింది. అలాగే గతంలో భారత్ అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉంది అని పేర్కొంది. తాజగా నివేదికలో కట్టబడి బదులుగా కొనుగోలు చేసే ఉద్దేశంతో అన్నట్లుగా మార్పులు చేసింది. మధ్య తరహా పరిశ్రమలకు ఎటువంటి నష్టం ఉండదు. అమెరికాకు చెందిన పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్స్, జొన్నలు, డ్రై ఫ్రూట్స్, సోయాబీన్ ఆయిల్, వైన్ వంటి వాటి పై భారత్ సుంకాలను తగ్గించనుందని పేర్కొంది. రాబోయే ఐదేళ్లలో సుమారు 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ ఇంధనం, ఐటీ, బొగ్గు, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని భారత్ భావిస్తోందని తెలిపింది. గత వారం వెలువడిన ఉమ్మడి ప్రకటనలో కూడా పప్పుధాన్యాల ప్రస్తావన లేదు. వైట్ హౌస్ తన తాజా సవరణ ద్వారా ఆ ప్రకటనకు అనుగుణంగా మార్పులు చేసినట్లు కనిపిస్తోంది. మన దేశానికి అగ్రరాజ్యం ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తుల పై సుంకాలను తగ్గించేందుకు మొదట నుంచే భారత్ అంగీకరించడం లేదు. అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల భారత రైతులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎటువంటి నష్టం ఉండదని ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖమంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్ట్‌షీట్‌లో సవరణలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఎప్పుడూ స్పష్టమైన దృక్పథం తోనే ఒప్పందాలు కుదుర్చుకుంటుంది. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల జీవనోపాధికి హాని కలిగించే ఏ రంగాన్నైనా తెరిచే ప్రసక్తే లేదు.

# ఏపీలో కొత్తగా మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు స్టేషన్‌లలో హాల్ట్..



- ఏపీకి సంబంధించి రైల్వేమంత్రికి రిక్వెస్ట్‌లు
- కొత్తగా రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని కోరిన ఎంపీ
- రైల్వే ప్రాజెక్టుల పై కూడా వినతులు
- వందే భారత్ కు కూడా స్టాప్!

**న్యూ ఢిల్లీ: పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** ఏపీలో మరికొన్ని రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించేలా రైల్వేమంత్రిని ఎంపీ ఎంపీ శ్రీ భరత్ కోరారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ విస్తరణతో పాటుగా మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరారు. అలాగే వందేభారత్ రైళ్లకు దువ్వాడలో హాల్ట్ కల్పించేలా అనుమతి ఇవ్వాలని రిక్వెస్ట్చేశారు. ఈ మేరకు రైల్వేమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఆర్వోబీలు, ఆర్‌యూబీలు కూడా నిర్మించాలని కోరారు. ప్రకాశం, పల్నాడుజిల్లాలకు సంబంధించి కొన్ని కొన్ని అంశాల పై ఎంపీలు రిక్వెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీలు రాష్ట్రానికి సంబంధించిన నేషనల్ హైవేలు, రైల్వేకు సంబంధించిన ప్రాజెక్టుల పై కేంద్రానికి వినతులు చేస్తున్నారు. ఇటీవల పలువురు ఎంపీలు వారి నియోజకవర్గాల్లో రైళ్లు ఆగేలా రిక్వెస్ట్ చేసి హాల్ట్‌లు సాధించారు. తాజాగా మరికొన్ని రైళ్లక సంబంధించి రైళ్లను ఆపాలంటూ ఎంపీలు రిక్వెస్ట్ చేశారు. విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారు. విశాఖపట్నం మీదుగా నడిచే రైళ్లకు సంబంధించిన ఎమర్జెన్సీ కోటాను పెంచాలని రిక్వెస్ట్ చేశారు. అలాగే విశాఖపట్నంలో రైల్వేజోన్ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని కోరారు. విశాఖపట్నం మీదుగా నడిచే వందే భారత్ రైళ్లకు దువ్వాడ రైల్వే స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రశాంతి, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లు, కోర్బా- విశాఖపట్నం రైళ్లకు కొత్తవలస రైల్వేస్టేషన్‌లో హాల్టు సౌకర్య కల్పించాలన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను మరింత విస్తరించాలన్నారు. మరికొన్ని రిక్వెస్ట్‌లు కూడా చేశారు. బుధవారం పార్లమెంట్ కార్యాలయంలో గౌరవనీయ కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ని ఎంపీ శ్రీ భరత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ విస్తరణను వేగవంతం చేయడం, అలాగే రైల్వే జోన్‌కు సంబంధించిన తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించడం పై అంశాల పై చర్చించాము అని భరత్ తెలిపారు. విశాఖపట్నానికి సంబంధించిన కీలక రైల్వే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాను. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై, విజయవాడ వంటి అధిక డిమాండ్ ఉన్న మార్గాల్లో రైళ్ల కొరత ఉందని తెలియజేస్తూ, ఆయా మార్గాల్లో కొత్త వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించాలని కోరానన్నారు. అదే విధంగా కొత్తవలస, దువ్వాడ స్టేషన్లలో రైళ్లకు నిలుపుదల కల్పించాలనీ, విశాఖపట్నం మీదుగా ప్రయాణించే రైళ్లకు అత్యవసర కోటాను పెంచాలనీ, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో పలు ఆర్యుబి లు, ఆర్వోబి ల నిర్మాణం చేపట్టాలని కూడా ఆయనను అభ్యర్థించాను అంటూ ఎంపీ పోస్ట్ చేశారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని రైతులు, ఎగుమతిదారులు, వ్యాపారులు, విద్యార్థులు, ప్రజల కోసం రైల్వే వ్యవస్థలో చేపట్టాల్సిన పలు ప్రగతి అంశాల పై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని..ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తో కలసి భేటీ కావడం జరిగింది. ఈ మేరకు వినతులు సమర్పించడం జరిగింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుండి ప్రకాశం జిల్లా దర్శి, అద్దంకి, ఒంగోలు మార్గంగా రామాయపట్నం పోర్ట్ వరకు కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాము. వ్యవసాయాధారిత ప్రాంతమైన ఈ ప్రాంతంలో ఎగుమతులకు అనుకూల మైన పంటలు, అనుబంధ ఉత్పత్తులు పెద్ద మొత్తంలో ఉత్పత్తి అవుతున్నాయని, ప్రతిపాదిత రైల్వే లైన్ అమలులోకి వస్తే రామాయపట్నం పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతం అవడంతో పాటు, ప్రయాణికుల రాకపోకలకు కూడా సౌకర్యం కలుగుతుందని, చెన్నైసికింద్రాబాద్ మధ్య రైల్వే దూరం తగ్గి ప్రాంతీయ అనుసంధానం మెరుగుపడుతుందని వివరించాము అన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు. నడికుడిశ్రీకాళహస్తి కొత్త రైల్వే మార్గంలో సికింద్రాబాద్ నుండి వయా నడికుడి మీదగా కనిగిరి వరకు ప్రయాణికుల సౌకర్యార్థం డెమూ రైలు సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశాము. ప్రస్తుతం సికింద్రాబాద్‌కనిగిరి మధ్య నేరుగా రైలు లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, దైనందిన ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించాము. నడికుడిశ్రీకాళహస్తి రైల్వే మార్గం ప్రారంభమైనప్పటికీ, పూర్తి విద్యుదీకరణ ఇంకా జరగలేదని, ఈ నేపథ్యంలో డెమూ రైల్ సర్వీస్ ప్రారంభించడం తక్షణ పరిష్కారమని, విద్యుదీకరణ పూర్తయ్యాక ఇదే సర్వీసును మెము రైల్ సర్వీస్ గా అప్‌గ్రేడ్ చేయవచ్చని తెలియజేస్తూ వీటి పై తక్షణమే చొరవ చూపాలని మంత్రి కి విజ్ఞప్తి చేశాము అని పోస్ట్ చేశారు.

# జిల్లాలో మంజూరు చేసిన పనులు పూర్తి చేయాలి కలెక్టరు విజయ కృష్ణన్




**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** జిల్లాలో మంజూరు చేసిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయం నుండి మండల అభివృద్ధి అదికారులు, ఇంజనీరింగు అధికారులు, విద్యుత్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, క్రీడాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పనులు ప్రస్తుత పరిస్థిని సమీక్షించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరు చేసిన నిర్మాణ పనులన్నింటిని వెంటనే పూర్తిచేయాలని, నిధులు మురిగిపోయినట్లయిన సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి మండలానికి 5 గ్రామాలను ఒడిఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశం చేయడం జరగిందని, ఆ గ్రామాలలో సోక్ పిట్స్, మేజిక్ డ్రయిన్స్ తదితర నిర్మాణాలన్నింటిని పూర్తిచేయాలని తెలిపారు. పాఠశాలలలో, వసతిగృహాలలో జీరో వేస్ట్ మేనేజ్మెటు అమలు చేయాలని తెలిపారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వీధికుక్కలు సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి మునిసిపాలిటీ, మండలంలో వీధి కుక్కలకు షెల్టర్లు ఏర్పాటు చేసి మార్చినాటికల్లా జిల్లాలో గల అన్ని వీధికుక్కలకు స్టెరిలైజేషను ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. జిల్లాలో 65 శాతం గా గల అక్షరాస్యత శాతం పెంచుటకు అక్షర ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని, జిల్లాలో వయోజన విద్య సెంటర్లకు వస్తున్న 91 వేలమంది వచ్చేనెలలో జరిగే పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులయ్యేటట్లు వారికి చదువు చెప్పాలని తెలిపారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది వయోజనవిద్య సెంటర్లను సందర్శించి వారికి అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి ఎస్.సి.,ఎస్.టి. కుటుంబాలకు అందిస్తున్న ఉచిత సోలారు విద్యుత్ ఏర్పాటు పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదే విధంగా పి.ఎం.సూర్యఘర్ పథకాన్ని ప్రతి విద్యుత్ వినియోగదారుడు వినియోగించు కొనేలా అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ అదికారులకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లాపరిషత్ డిప్యూటీ సిఇఒ, డుమా,ఇంజనీరింగు,విద్యుత్ శాఖ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

జారీః జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, అనకాపల్లి

# ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రతిష్ట పై కుట్రలు విఫలం..



- ఆర్‌టీవీ, సాక్షి మీడియా ప్రసారం చేసిన అవాస్తవాల పై టీడీపీ నేతల ఆగ్రహం.
- అభివృద్ధి తట్టుకోలేక అవాస్తవాలుడ
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేరుతో ప్రచారాల పై టీడీపీ ఫైర్.
- బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్.

**గన్నవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** ఎమ్మెల్యే పేరును దుర్వినియోగం చేస్తూ ఆర్‌టీవీ సోషల్ మీడియా ఛానెల్, సాక్షి టీవీ ఛానెల్‌లో ప్రసార మైన అవాస్తవాలు, కట్టు కథలను తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గన్నవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు మాట్లాడారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గూడవల్లి నరసింహారావు మాట్లాడుతూ పేదవారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఇచ్చిన రికమండేషన్ లెటర్ ను దందాగా చూపించడం దురుద్దేశపూరితమని గూడవల్లి నరసింహారావు అన్నారు. ఆరోపణలు వచ్చిన వెంటనే దాన్ని నిలిపివేశారని, ఈ విషయం పది రోజుల క్రితమే ముగిసిందని తెలిపారు. సూర్యుడి పై ఉమ్మితే అది వారిమీదే పడుతుందని అన్నారు. అబద్ధాలను ప్రచారం చేసే వారి కుట్రలు చివరికి వారినే దెబ్బతీస్తాయి అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయం పది రోజుల క్రితమే పూర్తిగా పరిష్కార మైందని తెలిపారు. అయినప్పటికీ పాత విషయాలను తవ్వి అబద్ధపు కథనాలు ప్రసారం చేయడం ఎమ్మెల్యే వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ కుట్రలో భాగమని తక్షణమే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని లేదంటే చట్టపర మైన చర్యలు చేపడతామని అనుచిత వ్యాఖ్యలు ప్రసారం చేసిన మీడియా ఛానెల్ వారిని హెచ్చరించారు. గన్నవరం మాజీ సర్పంచ్, మాజీ ఎంపిపి తులిమెల్లి ఝాన్సీ రాణి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధి పై ఆధారాలు లేకుండా అవినీతి ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. సేవా కార్యక్రమాలను రాజకీయంగా మలచడం ప్రతిపక్షాల దిగజారుడు ధోరణి అని తీవ్రంగా ఖండించారు. మహిళల సంక్షేమం, పేదల ఉపాధి కోసం పనిచేసే నిస్వార్థ నాయకుడి పై ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేయడం రాజకీయ దౌర్భాగ్యమని తీవ్రంగా ఖండించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్ మాట్లాడుతూ సమస్య తలెత్తిన వెంటనే దాన్ని పూర్తిగా సరిచేసిన విషయాన్ని మీడియా కావాలనే దాచిపెట్టి ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు. నిజాలను వక్రీకరించి ప్రజల్లో అనవసర అనుమానాలు కలిగించేలా కథనాలు ప్రసారం చేయడం బాధ్యతారాహిత్యమని మండి పడ్డారు. గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతుండటాన్ని తట్టుకోలేక ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రజల కోసం పనిచేసే నాయకుడి పై మచ్చ వేయాలని చేసే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని అన్నారు. గన్నవరం ఏయంసి డైరెక్టర్లు కొండేటి వెంకటేశ్వర రావు, కానూరు శేషు మాధవి తదితరులు మాట్లాడుతూ, వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే పై అవినీతి ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడానికి కొందరు మీడియా వేదికలను వాడుకోవడం బాధాకరమని, ఇకముందు ఇలాంటి తప్పుడు ప్రచారాలను సహించ బోమని హెచ్చరించారు. గన్నవరం పట్టణ టీడీపీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ రాజకీయ లాభాల కోసం అబద్ధాలను ప్రచారం చేసే ధోరణి ప్రజల్లో అసహనం పెంచుతోందని అన్నారు. ఎమ్మెల్యే నిజాయితీ పై ఎలాంటి మచ్చ పడనీయమని, అవాస్తవ వార్తలను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా కొన్ని ఛానెల్స్ పని చేస్తున్నాయని, అబద్ధాలను నమ్మే రోజులు పోయాయి అని అన్నారు. ఎమ్మెల్యే వ్యక్తిత్వం ఎంతో స్వచ్ఛమైనదని, గన్నవరం నియోజకవర్గంలో ఆయన చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. గ్రామాల అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడిని చూసి ప్రతిపక్ష పార్టీలు తట్టుకోలేకపోతున్నాయని మండి పడ్డారు.

గన్నవరం నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ మాట్లాడుతూ అనునిత్యం ప్రజలకోసం పరితపిస్తూ నిస్వార్థ సేవ చేస్తున్న నాయకుడి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, పేదవాడికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేసే తెలుగుదేశం పార్టీ సేవలను దందాగా చూపించడం, అవాస్తవాలు ప్రసారం చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఆర్‌టీవీ సోషల్ మీడియా ఛానెల్, సాక్షి టీవీ ఛానెల్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం గన్నవరం రైతుబజార్‌లో వ్యాపారం చేసుకుంటున్న పలువురు దుకాణదారులు కూడా ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, గన్నవరం రైతుబజార్‌లో తమ వ్యాపారం సవ్యంగా కొనసాగుతోందని తెలిపారు. దందాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. తాము ఎవ్వరికీ డబ్బులు ఇవ్వలేదని పేర్కొన్నారు. నాగబాబు అనే వ్యక్తి అంశం పై సంబంధిత అధికారులు స్పందించి ఎప్పుడో సరిచేశారని, ప్రస్తుతం తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని వ్యాపారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు నాయకులు గొంది నరేంద్రతో పాటు స్థానిక టీడీపీ నాయకులు, పాల్గొని మీడియా తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించబోమని, తక్షణమే తప్పుడు వార్తలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.

# మహా శివరాత్రి వేడుకలకు జిల్లా పోలీసుల భారీ బందో బస్తు.

కళ్యాణపు లోవ లో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధి లోని కళ్యాణపు లోవ పోతురాజు బాబు (శివ) ఆలయ జాతర మహోత్సవాలకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట మైన ఏర్పాట్లు పూర్తి చేసింది. ఫిబ్రవరి 15 నుండి 17 వరకు జరిగే ఈ ఉత్సవాల భద్రతను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది సుమారు 2 నుండి 3 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను ఏర్పాటు చేశారు.

దొండపూడి చెక్ పోస్ట్ నుండి ఆలయం వరకు ఉన్న 8 కి.మీ. మేర ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. రోడ్డు విస్తరణ కారణంగా ఈసారి 70 ఆర్టీసీ బస్సులు నేరుగా ఆలయం వరకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. భక్తుల పుణ్యస్నానాల కోసం 9 ఘాట్లు సిద్ధం చేశారు. ప్రమాద నివారణకు 10 మంది గజ ఈతగాళ్లు, 5 బోట్లు, లైఫ్ జాకెట్లు, తాడులతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. జాతర ప్రాంగణమంతా సీసీ టీవీ కెమెరాల నిఘాలో ఉంటుంది. వీటిని ప్రత్యేక కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేసి, ప్రతి కదలికను నిశితంగా గమనిస్తున్నారు. చోడవరం ఎమ్మెల్యే సహకారంతో 48 ఎకరాల స్థలాన్ని భక్తుల కోసం సిద్ధం చేశారు. 28 ఉచిత భోజన శాలలు, మహిళల కోసం ప్రత్యేక మొబైల్ టాయిలెట్లు, డ్రెస్ చేంజింగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతియుతంగా దర్శనం చేసుకోవాలి ఎస్పీ కోరారు. ముఖ్యంగా స్నాన ఘట్టాల వద్ద మహిళలు, పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి. దొంగతనాల నివారణకు ప్రత్యేక బృందాలను (ఎల్&ఓ, క్రైమ్) నియమించాం. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించండన్నారు. ఈ పర్యవేక్షణలో ఎస్.బి డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఎస్.బాల సూర్యరావు, కొత్తకోట సిఐ జీ.కోటేశ్వరరావు, ఎస్సై ఎం.శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐఎఫ్ఆర్2026 ను సమన్వయంతో విజయవంతం చేయాలి

- బీచ్ రోడ్డులో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.
- ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సమగ్ర ఏర్పాట్లకు ఆదేశాలు.



**విశాఖపట్టణం, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** విశాఖ వేదికగా జరగనున్న ఐఎఫ్ఆర్2026, సిటీ పరేడ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జీవీఎంసీ అధికారులతో కలిసి బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, ప్రధాన వేదిక, వీఐపీల సిట్టింగ్, వారి వాహనాల రాకపోకలు, సాధారణ ప్రజలకు వసతులు, బారికేడింగ్, క్యూలైన్లు, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, పార్కింగ్ వసతి, కంట్రోల్ రూమ్ ఏర్పాటు తదితర అంశాల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జెట్టీ ప్రాంతంలో ఉన్న పడవలను తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు తరలించాలనీ, అలాగే ఫైర్ షో, డ్రోన్ షో నిర్వహణకు అవసర మైన అనుమతులు ముందుగానే తీసుకోవాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. సమన్వయం కోసం అదనపు వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్లు అందుబాటులో ఉంచు కోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా కార్యక్రమ ప్రాంగణంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మెడికల్ క్యాంపులు, స్ట్రెచర్లతో కూడిన అంబులెన్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీఐఐసీ గ్రౌండ్ వద్ద అవసరమైన చర్యలు చేపట్టి, గ్రౌండ్ లెవెలింగ్, సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పొదలు తొలగించాలన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని స్పష్టంగా వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, లైవ్ స్ట్రీమింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, సాధారణ ప్రజల కోసం 100 మొబైల్ టాయిలెట్లు, అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైఎంసీఏ నుంచి కాళీమాత ఆలయం వరకు నిర్వహించనున్న కంటింజెంట్ కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పాల్గొనే వారికి అదనపు వసతులు కల్పించాలని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం బీచ్ వైపు 1,000 మంది వీక్షించగలిగేలా సరిపడా ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ప్రశాంతంగా, క్రమబద్ధంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నేవీ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# రెవిన్యూ శాఖ సంబంధించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** రెవిన్యూ శాఖ అంశాలకు సంబంధించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తహాశీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరు కార్యాలయం నుండి తహాశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ, పి.జి.ఆర్.ఎస్ రెవిన్యూ క్లినిక్, మ్యుటేషన్లు, రీసర్వే, రీసర్వే రీ వెరిఫికేషను, ఎం.ఎల్.సి.సి., బూత్ లెవల్ సమావేశాలు, ప్రభుత్వ భూములు పరి రక్షణ, ఇంటివద్దకే రేషను పంపిణీ, రేషను దుకాణాలు తనిఖీ, అనుమతులు మంజూరు తదితర అంశాల పై మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్. రెవిన్యూ క్లినిక్ కార్యాక్రమాల ద్వారా వచ్చిన ధరఖాస్తుల పై మరుసటిరోజునే క్షేత్ర స్థాయి సందర్శన నిర్వహించి, సమస్య పై వెంటనే చర్యలు తీసుకోవాలని, పరిష్కారం కాని సమస్య అయితే అర్జీదారునికి వెంటనే తెలియజేయాలని, ఎండార్సుమెంటు కాపీని అర్జీదారునికి అందించాలని తెలిపారు. నిర్ణీత గడువు లోగా అర్జీలు పరిష్కరించాలని, తగిన కారణం లేకుండా మ్యుటేషన్లు తిరస్కరించకూడదని, మ్యుటేషను ధరఖాస్తు సమయం లోనే అర్జీదారునికి కావలసిన సమాచారం అందించి, సరిగా ధరఖాస్తు చేయించాలని తెలిపారు. తహాశీల్దార్లు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పని సరిగా చేయాలని, గ్రామాలలో గల ప్రభుత్వ భూముల పరిస్థితిని పరిశీలించాలని, అన్యాక్రాంతం కాకుండా వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండవ విడతలో రీసర్వే జరిగిన గ్రామాలలో మరల క్షేత్ర పరిశీలనచేసి, రికార్డులు పరిశీలించి, తప్పులను సరిదిద్ది, ఎటువంటి తప్పులు లేకుండా పాసుపుస్తకాలు ముద్రణకు పంపించాలన్నారు. రీ వెరిఫికేషను తరువాత పిర్యాదులు వస్తే సంబంధింత అధికారుల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి తీరువా నూరు శాతం వసూలు చేయాలని, వసూలుకాని గ్రామాలలో రైతులకు విషయం తెలియజేసి, వసూలు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రతివారం బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించాలని, ఎప్పటికప్పుడు కొత్త ఓటర్లు నమోదు, మరణించిన, వలసవెళ్లిన వారి ఓట్లు తొలగింపు చేసి శుద్ధమైన ఓటరు లిస్టు తయారుచేయాలన్నారు. ప్రతి శనివారం మండల స్థాయి సమన్వయ కవిటీ సమావేశాలు నిర్వహించి మండల స్థాయి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎన్.ఒ.సి., సాల్వెన్స్ సర్టిఫికెట్స్, ఉద్యోగార్థులకు క్యారెక్టరు సర్టిఫికెట్, వివిధ లైసెన్స్ లు మంజూరు, తదితర ధృవపత్రాలను వారం రోజులలోగా అందజేసేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సివిల్ సప్లయి కి సంబంధించి ఇంటివద్దకే రేషను సరుకులు పంపిణీ నిర్ణీత గడువులోపునే నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. తహాశీల్దార్లు లక్ష్యం మేరకు రేషను డిపోలు తనిఖీలు నిర్వహించి రిపోర్టు పంపిచాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, సర్వే శాఖ సహాయ సంచాలకులు ఎస్. గోపాల్ రాజా, డిఎస్ఒ కె.వి.ఎల్.ఎన్.మూర్తి, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్ లు, తహాశీల్దార్లు హాజరయ్యారు.

# అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు.

**భద్రత, మౌలిక వసతుల కల్పన, ఇతర ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ సమీక్ష**



**విశాఖపట్టణం, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 వ తేదీన జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఉదయం తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఆయన పలు అంశాల పై మార్గదర్శకాలు జారీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి అన్ని మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసర మైన చోట తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్టణం ఆర్డీవో సుధాసాగర్, డీఎం&హెచ్వో జగదీశ్వరరావు, ఎండోమెంట్ అధికారులు, ఆలయ ఈవో పద్మావతి, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి నీటి చుక్కనీ ప్రకృతి ఆధారిత పంటల కోసం వినియోగిద్దాం

- భవిష్యత్తు తరాల కోసం విత్తన గ్రామాలను అభివృద్ధి చేద్దాం
- జల వనరులు కోసం శ్రమదానం చేస్తున్న ఆదివాసీలు
- మన జీవవైవిధ్యాన్ని మనమే కాపాడుకుందాం
- డాక్టర్ శశిప్రభ, సిఇఒ, సిఫా ట్రస్ట్



**చింతపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** ప్రతి నీటి చుక్కనీ ప్రకృతి ఆధారిత పంటల కోసం వినియోగిద్దాం అని సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, నూతిబంద గ్రామంలో బుధవారం ఉదయం ఆమె గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జల వనరులు కోసం శ్రమదానం చేస్తున్న ఆదివాసీలను అభినందించారు. గ్రామస్తులు అందరూ శ్రమదానం చేసి చెక్ డ్యాం లు నిర్మించడం అభినందనీయం అన్నారు. అలాగే ప్రతి పొలం లో అయిదు శాతం భూమి లో గొయ్యి తవ్వి నీరు నిలబెట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. అలా చేసిన వారికి చేప పిల్లలను ఇస్తామన్నారు. ఇదే రీతిలో అందరూ భవిష్యత్తు తరాల కోసం విత్తన గ్రామాలను అభివృద్ధి చేద్దాం అని పిలుపునిచ్చారు. మన దేశీయ విత్తనాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చెయ్యాలి అని వివరించారు. నిర్మించిన చెక్ డ్యాం లు ఆధారంగా వచ్చే నీటిని వినియోగించి సంవత్సరం పొడవునా పంటలు పండించడం అవసరం అని పేర్కొన్నారు. లాభాలు వచ్చే విధంగా దేశీయ విత్తనాల ద్వారా పంటలు పండించడం వల్ల ఆదాయం పెరుగుతుంది అని వివరించారు. మన జీవవైవిధ్యాన్ని మనమే కాపాడుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఫా ట్రస్ట్ ప్రతినిధులు త్రిమూర్తులు, జూన్ బాబు, నూతిబంద గ్రామస్తులు పాల్గొని మాట్లాడారు.

## 20 నెలల పాలనలో కూటమి అనేక విజయాలు సాధించింది పప్పల




**యలమంచిలి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** యలమంచిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు మాట్లాడుతూ 20 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం అనేక విజయాలు సాధించిందని, సంక్షేమం, అభివృద్ధి, సుపరి పాలనతో రాష్ట్ర పుణనిర్మాణం కోసం అనునిత్యం పనిచేస్తుందని, అనేక సవాలను అధిగమించి ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పునరుద్ధరణతో ప్రజల ఆశలు నెరవేర్చుతూ స్వర్ణాంధ్రకు బాటలు వేస్తుందని తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని, తల్లికి వందనం పథకం కింద 10,090 కోట్ల రూపాయలు తల్లుల ఖాతాలో 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం చేసిందని, స్త్రీ శక్తి పథకం కింద 5 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించారని, దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందిస్తున్నామని, ఇప్పటి వరకు 3.64 కోట్లు సిలిండర్లు అందజేశామని, అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో 6,310 కోట్ల రూపాయలు జమ చేశామని, ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతినెల 63 లక్షల మందికి పెన్షన్స్ అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ 58,654 కోట్ల రూపాయలు వెచ్చించామని, అత్యధిక మందికి పెన్షన్స్ ఇస్తున్న రాష్ట్రంగా గుర్తింపు పొందామని, దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, ఎక్కడైనా పెన్షన్ తీసుకునే అవకాశం కల్పించామని, మృత్యాకార భరోసా పేరుతో ఏడాదికి 20 వేల చొప్పున 1.25 లక్షల మందికి 250 కోట్లు అందించామని, నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఆటో డ్రైవర్లకు సేవలో ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున ఇప్పటివరకు 436 కోట్లు జమ చేశామన్నారు. అన్నా క్యాంటీన్ లు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసి 7.50 కోట్ల భోజనాలు అందించామని, గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయించి, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ చేశామని, ఇమాములకు 10,000 రూపాయలు, మౌజనులకు 5,000 రూపాయలు చొప్పున గౌరవ వేతనం అందించా, అర్చకులకు వేతనం నెలకు 15 వేలకు పెంచామని, నాయి బ్రాహ్మణులకు 25,000 ఇస్తున్నామని, జూనియర్ లాయర్లకు 10,000 రూపాయలు అందిస్తున్నామని అన్నారు. మెగా డీఎస్సీ కు ముఖ్యమంత్రి తొలి సంతకం పెట్టి 15,941 ఉద్యోగాలు కల్పించారని, కానిస్టేబుల్ నియామకాలు పూర్తిచేసి వారి స్టయిఫన్డ్ పెంచామని, రాజముద్రతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని, అంగన్వాడి కార్యకర్తలకు, ఆసాలకు గ్రాడ్యుటీ అమలు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1000 కోట్ల రూపాయలతో రోడ్లు మరమ్మత్తులు, పల్లె పండగ ద్వారా గ్రామాలలో 4,000 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణం చేశామని, సాగినీటి ప్రాజెక్టులకు ఈ 20 నెలలో 23,790 కోట్లు ఖర్చు చేశామని, సర్వేయంగా పోలవరం నిర్మాణం అవుతుందని, ఇది మంచి ప్రభుత్వం అని, స్వర్ణాంధ్ర సాధించే దిశగా కుటుంబ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ మూర్తి, ఇత్తంశెట్టి రాజా వెంకట రమణ, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం






**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** భారతీయ జనతా పార్టీ విశాఖపట్నం జిల్లా కార్యాలయంలో పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా సమర్పణ దివస్ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం లాసన్స్ బే కాలనీ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో, భారతీయ జనతా పార్టీ ఏకాత్మతా మానవతా వాదం సిద్దాంతకర్త, భారతీయ జనసంఘ్ పూర్వ అధ్యక్షులు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని సమర్పణ దివస్ గా జరిపి నివాళులర్పించారు. బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎంఎంఎన్ పరశు రామ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివీఎన్ మాధవ్ పాల్గొని దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవిచూస్తూ దేశ సేవకు నిమగ్నమై దానినే జీవన కార్యంగా మలచుకున్న పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మరణం తర్వాత జనసంఘ్ నామరూపాలు లేకుండా పోతుందని ఆశించిన వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ పార్టీని దేశవ్యాప్తంగా పటిష్ఠపరచిన ఘనత దీనదయాళ్‌జీ కి దక్కుతుందని తెలిపారు. బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పరశు రామ రాజు మాట్లాడుతూ జనసంఘ్‌లో చేరినప్పటి నుంచి మహారథి యై పార్టీకి సారథ్యం వహించి, దేశ రాజకీయాలలో జనసంఘ్‌కు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంలో కృతకృత్యులై 1967 లో పార్టీ అఖిల భారత అధ్యక్షులైన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ కాలికట్‌లో జరిగిన అఖిల భారత జనసంఘ్ మహాసభలో భారత దర్శనాన్ని ప్రదర్శింపచేసి విశేష కీర్తి నార్జించారని కొనియాడారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించి అసమాన్య వ్యక్తిగా ఎదిగిన అతి కొద్ది మంది మహనీయులలో పండిట్ దీనదయాళ్ ఒకరని, అటువంటి మహా తపస్వి కొంత మంది దుష్ట రాజకీయాలకు ఉత్తరప్రదేశ్ లోని మొగల్ సరాయి రైల్వే స్టేషన్‌లో 1968 ఫిబ్రవరి 11 న రైలు పట్టాల వద్ద అనుమానాస్పదంగా మృతి చెందడంతో లక్షలాది కార్యకర్తల హృదయాలు ఎంతో మనోవేదన చెందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం నాగేంద్ర, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇంచార్జి ఎస్వీఎస్ ప్రకాష్ రెడ్డి, బీజేపీ ఏలూరు జిల్లా ఇంచార్జి బొండాడ నరేంద్ర ప్రకాష్, బీజేపీ మెడికల్ కన్వీనర్ రూపాకుల రవి కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వర రావు, దడి పురుషోత్తం రమేష్, సిరసపల్లి నూకరాజు, పొలిమేర శ్రీనివాస రావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్, అధిక సంఖ్యలో బీజేపీ జిల్లా పదాధికారులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పించారు.

# సైబర్ మోసాలు నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలి.

**జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్.**



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** భారత రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ బుధవారం కలెక్టరు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ప్రారంభించారు. ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు జరిగే వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సైబర్ మోసాలు, మనీ న్యూలింగ్ నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంతే కాకుండా కేవైసీ, సికేవైసీ ప్రాముఖ్యత పై ప్రజలకు విస్తృత అవగాహన, ప్రచారం కల్పించాలని బ్యాంకింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత పోస్టర్లు, టీవీ కమర్షియల్ యాడ్స్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సత్యనారాయణ ఎస్టీసీ కేఆర్సి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# డి పట్టాల విష్యంలో ఎమ్మెల్యే నిరాధార ఆరోపణలు తగవు



**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఫిబ్రవరి 11**: గతంలో 16 దళిత కుటుంబాలకు ఇచ్చిన డి పట్టాలలో అవినీతి చేసారు అని ఇవ్వడం పై నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పై కొన్ని పత్రికలలో వచ్చిన కథనాలను స్థానిక కూటమి నాయకులు ఖండించారు. బుదవారం వీరు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే పై అక్రమంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. ఈ సందర్భంగా రాంబిల్లి మండలం కృష్ణంపాలెం, సీతపాలెం గ్రామస్తులు ఆర్ ఆర్ కాలనీ పంచదార లోనే కావాలని అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు నిర్వాసితులు విన్నవించుకోవడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్, మండల స్థాయి అధికారులను పంచదార లోని సర్వే నెంబర్ రెండు ని పరిశీలించమని ఆదేశాలు ఇవ్వగా, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చాలా డీ పట్టా భూముల్లో అక్రమ క్యారీలు జరిగాయని, ప్రైవేటుగా లే అవుట్ లు వేసి అమ్మారని అధికారుల దృష్టికి వెళ్లింది. డీ పట్టిదారులు నిబంధనలు ఉల్లంఘించారని సదరు భూములను తాసిల్దారు రెస్యూమ్ చేయడం జరిగిందన్నారు. దీని పై ఎవరైతే భూములు కోల్పోయిన వారికి, ఏ విధంగా సహాయం చేయాలో చూడమని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చెప్పడం జరిగిందన్నారు. ఈ విషయం తెలుసుకొని కొన్ని వార్త పత్రికలు, న్యూస్ చానల్స్ ఎమ్మెల్యే పై బురద జల్లి అనవసరంగా ఈ వ్యవహారం లోకి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కు అంటగట్టారు అని, కానీ ఎమ్మెల్యేకి ఈ విషయం మై ఎటువంటి సంబంధం లేదు అని స్థానిక నాయకులు తెలిపారు. ఈ విషయంలో కొన్ని పత్రికలు ఎమ్మెల్యే పై నిరాధార వార్తలు రాస్తే న్యాయ పరమైన వ్యవహారాలు ఎదుర్కోవలిసి వస్తుంది అని హెచ్చరించారు.

# క్యాన్సర్ రోగులకు పెమ్మసాని చేదోడు.

- గుంటూరు, కడపలో ఆధునిక క్యాన్సర్ చికిత్సకు కేంద్ర సహాయం.
- ఓఎన్‌జీసీ సిఎస్ఆర్‌తో రెండు లైనాక్ యంత్రాలు మంజూరు పెమ్మసాని,



**.దిల్లీ, పెన్ సత్తా, ఫిబ్రవరి 11::** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రులకు ఆధునిక క్యాన్సర్ చికిత్సల నిమిత్తం 2 లైనాకు మిషన్లను అందజేస్తున్నామని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ని కలసి, ఓఎన్‌జీసీ సంస్థ అందించిన విశిష్ట సిఎస్ఆర్ మద్దతుకు కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన స్క్రీనింగ్‌లో లక్షలాది మందికి పైగా మందిని పరీక్షించగా, అంచనా ప్రకారం 22,888 అనుమానాస్పద క్యాన్సర్ కేసులు గుర్తించ బడ్డాయి. ప్రస్తుతం రాష్ట్రంలో వేలాది మందికి పైగా క్యాన్సర్‌తో పోరాడుతున్నారని అంచనా. ఈ నేపథ్యంలో ఓఎన్‌జీసీ సిఎస్ఆర్ కింద గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒక్కోటి సుమారు రూ.30 కోట్ల విలువైన రెండు అత్యాధునిక లైనాక్ యంత్రాలను మంజూరు చేశారు. మొత్తం రూ.60 కోట్ల విలువైన ఈ యంత్రాల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో క్యాన్సర్ చికిత్సకు పెద్ద ఊతం లభిస్తుంది. ఈ యంత్రాల కోసం అవసరమైన ప్రత్యేక బంకర్లు, మౌలిక వసతులు, శిక్షణ పొందిన ఆంకాలజిస్టులు, సాంకేతిక సిబ్బంది ఇప్పటికే సిద్ధంగా ఉన్నారు. యంత్రాల ఏర్పాటు పూర్తయ్యిన వెంటనే సేవలు ప్రారంభించగలిగే పరిస్థితి ఉంది. యంత్రాల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసేందుకు హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ ద్వారా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు సమీప రాష్ట్రాల రోగులకు కూడా సమయానుకూలంగా, అంతర్జాతీయ ప్రమాణాల రేడియోథెరపీ సేవలు అందుబాటు లోకి వస్తాయి. ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేయడంలో సహకరించిన కేంద్ర మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరీ కి హృదయపూర్వక ధన్యవాదాలు పెమ్మసాని తెలిపారు. శానికి మార్గదర్శకత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలో క్యాన్సర్ చికిత్స సామర్థ్యం గణనీయంగా పెరిగి, వేలాది రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని డా. పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# నక్కపల్లి లో ఘనంగా దీన్ దయాల్ వర్ధంతి వేడుకలు

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** మండల కేంద్రం నక్కపల్లి భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద పండిట్ దీన్ దయాల్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం బిజెపి మండల అధ్యక్షులు పోలినాటి నానాజీ, పాతల పాటి రవి రాజు, రాష్ట్ర కిషన్ మోర్చా సభ్యులు డాక్టర్ రత్న భరత్, జిల్లా జీఎస్ కోసూరి శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు, దాడిశెట్టి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి గట్టెం నానాజీ, కిషన్ మోర్చా కార్యదర్శి షేక్ ఇమామ్, హుస్సేన్ జిల్లా మైనార్టీ మోర్చా బుద్దాల నాగమణి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు, సీనియర్ నాయకులు ఈగల వెంకటేశ్వరరావు, ఈగల త్రినాధమ్మ,తుమ్మల కుమారి, కొల్నాటి అప్పారావు, నాగన బోయిన సూరిబాబు, బంగారు శివ, అమ్మోరియా రామకృష్ణ యాదవ్, వేముల వెంకటరమణ తదితరులు దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు అయినా చేసిన సేవలను స్మరించుకున్నారు.



# స్మశాన వాటిక ఆక్రమణలు తొలగించండి




**తహసిల్దార్ కార్యాలయంలో దేవవరం పద్మశాలీలు ఫిర్యాదు**

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** నక్కపల్లి మండలం దేవవరంలో పద్మశాలీలకు కేటాయించిన బరియల్ గ్రౌండ్ ఆక్రమణలను తొలగించాలని బుధవారం గ్రామానికి చెందిన పలువురు పద్మశాలీలు నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తరతరాలుగా పద్మశాలీల కులస్తుల దహన సంస్కారాలకు కేటాయించిన స్మశాన వాటిక ను కొంతమంది ఆక్రమించి ఇనప కంచెను వేస్తున్నారని రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి స్మశాన వాటికలో ఆక్రమణలను తొలగించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసిల్దార్ నారాయణరావుకు మెమొరండం అందజేశారు . ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహామూర్తి, బలరామరాజు పలువురు పద్మశాలీల నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ పట్టా పొందిన శ్రీలీల



**సినిమా డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** శ్రీలీల తల్లి కోరిక మేరకు పట్టు దలగా డాక్టర్ పట్టాను పొందింది. ఇప్పుడు ఆమె డాక్టర్ కమ్ యాక్టర్ శ్రీలీల. వివిధ రంగాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వారు సైతం నటీనటులుగా, దర్శక నిర్మాతలుగా తమ సత్తా చాటుకోవడానికి ఈ రంగం లోకి వస్తుంటారు. ఇక్కడ అనేక కష్టనష్టాలను చిరునవ్వుతో భరిస్తారు. అందులో కొందరు తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. మరికొందరు నిరాశతో వెనుదిరుగుతారు. వైద్య వృత్తిని కాదనుకుని సినిమాల్లోకి వచ్చిన వారూ చాలామంది ఉన్నారు. అయితే చిత్రంగా సినిమా రంగంలోకి వచ్చిన తర్వాత అదీ నటిగా స్టార్ స్టేటస్ ను అందుకున్న తర్వాత వైద్య విద్యను పూర్తి చేసిన ఘనత శ్రీలీలకు దక్కుతుంది. బిజీ షెడ్యూల్స్ మధ్య ఏ మాత్రం గ్యాప్ దొరికినా చదువు పై శ్రీలీల దృష్టి పెట్టింది. డాక్టర్ అవుతానని తల్లికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. ఈ క్రమంలో ఆమెకు దర్శక నిర్మాతల నుండి కూడా సహకారం, ప్రోత్సాహం లభించాయి. విశేషం ఏమంటే చాలా మంది స్టార్ హీరోలు, హీరోయిన్లు తమ వారసులను సినిమా రంగంలోకి తీసుకు రావాలని చూస్తారు. అయితే శ్రీలీల తల్లి స్వర్ణలత అందుకు భిన్నం. కూతురుకు ఇష్టమైన సినిమా రంగంలో ఆమెను ప్రోత్సహిస్తూనే తన వైద్య వృత్తిలోకి శ్రీలీలను ప్రవేశపెట్టాలని భావించారు. అలా యాక్టర్ కమ్ డాక్టర్గా శ్రీలీల ఇవాళ తల్లి కోరికను తీర్చినట్టు అయ్యింది. శ్రీలీల ఎంబీబీయస్ పూర్తి చేసి పట్టాను స్వీకరిస్తున్న ఫోటో, చిన్నపాటి వీడియో సోషల్ మీడియాలో ఇప్పుడు చక్కర్లు కొడుతున్నాయి. పట్టుదల ఉంటే ఎలాంటి ఒత్తిడిలో అయినా అనుకున్న లక్ష్యాన్ని మహిళలు చేరుకోగలరని శ్రీలీల నిరూపించింది. ఈ సందర్భంగా ఆమె పై అభిమానులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# భారత ఓడరేవులు( పోర్టల్ ) ఉద్యోగ ఫలితాల్లో సత్త సాటిన తెలంగాణ యువకుడు

**సివిల్ ఇంజనీరింగ్ లో జాతీయస్థాయిలో 5వ ర్యాంక్**

**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 11:**ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన షేక్ సలీం బుధవారం వెలువడిన జాతీయ ఓడరేవులు( పోర్టల్ ) సివిల్ ఇంజనీరింగ్ ఫలితాలలో (ము చీూ ఞూ 525007943)

160 మార్కులకు గాను 146.25 మార్కులు సాధించి జాతీయస్థాయిలో ఐదవ ర్యాంక్ ను కైవసం చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా సివిల్ ఇంజనీరింగ్ అర్హత కలిగిన 14 పోస్టులు వెలువడిగా వీటిలో 9 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు ఉండగా 5 అసిస్టెంట్ మేనేజర్ ( ఇన్ఫ్రాస్ట్రక్చర్ & ఫెసిలిటీస్ ) పోస్టులు ఉన్నాయి. వీటిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు అర్హత సాధించాడు. ఈ నియామక పరీక్ష 2025 డిసెంబర్ 2వ తేదీన నిర్వహించారు

నాగులవంచ రైల్వే కాలనీలో 2002 జనవరి 2 తేదీన జన్మించిన సలీం 1 నుండి 10వ తరగతి వరకు ఖమ్మంలోనే కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ న్యూ విజన్ కళాశాల విద్యను అభ్యసించి 2020 ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 987 మార్కులు సాధించి తెలంగాణలో ఐదో ర్యాంకు సాధించాడు.ఎన్ఐటి వరంగల్ నందు 2024 లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేశారు. సివిల్ ఇంజనీరింగ్ లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(×జుూ) సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. ఇతని తండ్రి నాగుల్ మీరా ఖమ్మంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మామిళ్ళగూడెం నందు ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్నాడు.జాతీయస్థాయిలో తమ గ్రామానికి చెందిన యువకుడు విజయం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు



## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**నక్కపల్లి మహిళా ఎస్ఐ సాహిబా అంజుమ్**



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 10:** యువత సమాజంలో జరుగుతున్న చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నక్కపల్లి మహిళా ఎస్ ఐ సాహిబా అంజుమ్ తెలిపారు. మత్స్యకార గ్రామం రాజయ్యపేటలో బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న యువత ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ
గ్రామాల్లో ఉన్న ఆలయ హుండీల భద్రత,సీసీ కెమెరాల ఏర్పాటు,వాటి ప్రాముఖ్యత, క్రికెట్ బెట్టింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే
ఆన్లైన్ బెట్టింగ్, గేమ్స్ వంటి వాటికి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం వివిధ రకాలుగా
ఆన్లైన్, వాట్సాప్ లో వచ్చే తప్పుడు మెసేజ్ ఓపెన్ చేసి సైబర్ మోసాలకు గురి కావద్దని సూచించారు. మండలంలో జరుగుతున్న దొంగతనాలు,
గంజాయి అక్రమ రవాణా, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించి అలాంటి కార్యక్రమాల ద్వారా వచ్చే ఇబ్బందులను వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా
హెల్మెట్ వినియోగించాలని వాటి ప్రాముఖ్యతను వివరించారు.
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం,మద్యం సేవించి వాహనం నడపడం చేయరాదని తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందజేయాలన్నారు.
ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, యజ్జల లోవరాజు, నాగేష్, వెంకటేష్, స్థానిక యువకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మూలపర పాఠశాలను ఆర్ అండ్ ఆర్ కాలనీకి తరలించాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 11:** ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ లో భూములు, ఇళు కోల్పోయిన నిర్వాసితుల పిల్లలను ఆర్ అండ్ ఆర్ కాలనీలో పాఠశాలకు తరలించాలని తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం మూలపర గ్రామస్తులు డిప్యూటీ తహసిల్దార్ నారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ మూలపర గ్రామంలో నిర్వాసితుల ఇళ్లతో పాటు ప్రభుత్వ పాఠశాలను కూడా కూల్చి వేయడం జరిగిందన్నారు. ఈ పాఠశాలలో సుమారు 22 మంది విద్యార్థులు ఉన్నారని విద్యార్థులతో పాటు ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఆర్ అండ్ ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రస్తుతం భూములు కోల్పోయిన నిర్వాసితులందరూ కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నామని తమ పిల్లలను కాలనీ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గోసల కాసులమ్మ, చందనాడ సర్పంచ్ తల్లా భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు పలువురు మహిళలు పాల్గొన్నారు.ద

## అదానీ పరువు నష్టం కేసు.. జర్నలిస్టుకు జైలు శిక్ష




**బిజినెస్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 11:**అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో జర్నలిస్ట్ రవి నాయర్ ను గాంధీనగర్ లోని మాన్సా మేజిస్ట్రేట్ కోర్టు దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో రవి నాయర్ కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. అదానీ గ్రూప్ ప్రధాన సంస్థ అయిన అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ రవి నాయర్ తప్పుడు, పరువు నష్టం కలిగించే ట్వీట్లను పోస్ట్ చేసి కంపెనీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారని ఆరోపించింది. ఈ ఫిర్యాదు ఆధారంగానే కేసు నమోదు కాగా, న్యాయస్థానం పూర్తి విచారణ చేపట్టింది. రవి నాయర్ పోస్టులు కేవలం అభిప్రాయ స్వేచ్ఛకు మించి, ప్రజలు, పెట్టుబడిదారులలో కంపెనీ విశ్వసనీయతను దెబ్బతీసే ఉద్దేశంతో ఉన్నాయని అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ వాదించింది. విచారణ అనంతరం కోర్టు, అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ తన కేసును నిరూపించిందని నిర్ధారిస్తూ, రవి నాయర్ ను క్రిమినల్ పరువు నష్టం నిబంధనల కింద దోషిగా తేల్చింది. తీర్పులో భాగంగా, నాయర్ కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు ఆర్థిక జరిమానా వేశారు. జరిమానా మొత్తం వివరాలు అధికారికంగా వెల్లడి కానప్పటికీ, జైలు శిక్షతో పాటు నగదు జరిమానా తప్పనిసరిగా విధించినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కార్పొరేట్, విధానపరమైన అంశాల పై తన విశ్లేషణలకు సుపరిచితుడైన స్వతంత్ర జర్నలిస్ట్ రవి నాయర్, ఈ తీర్పుపై వెంటనే స్పందించలేకపోయారు. భారతదేశంలో మీడియా వ్యక్తులు, కార్పొరేట్ సంస్థల మధ్య హై-ప్రొఫైల్ పరువు నష్టం కేసుల పట్ల పెరుగుతున్న న్యాయ, ప్రజా పరిశీలనల మధ్య ఈ శిక్ష ప్రాముఖ్యత సంతరించుకుంది.

# టీ20 వరల్డ్ కప్: ఇంగ్లండ్ కు ఓటమి రుచి చూపిన వెస్టిండీస్

**టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై 30 పరుగులతో వెస్టిండీస్ విజయం**

**విధ్వంసక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (76లి)**

**భారీ ఛేదనలో తడబడిన ఇంగ్లండ్.. 166 పరుగులకే ఆలౌట్**

**మూడు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన గుడాకేశ్ మోతీ**

**ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన రోస్టన్ చేజ్**



టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (76లి) ఆకాశమే హద్దుగా చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు సమష్టిగా రాణించడంతో కరీబియన్ జట్టు సునాయాసంగా గెలిచింది. 197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఓపెనర్ ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 30) మంచి ఆరంభాన్నిచ్చాడు. అయితే, పవర్ ప్లే తర్వాత విండీస్ బౌలర్లు పట్టు బిగించారు. ముఖ్యంగా స్పిన్నర్లు గుడాకేశ్ మోతీ (3/33), రోస్టన్ చేజ్ (2/29) వరుస విరామాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్ మిడిల్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా శామ్ కరన్ (30 బంతుల్లో 43లి) ఒంటరి పోరాటం చేశాడు. కానీ, అతనికి సహకారం కరవవడంతో ఇంగ్లండ్ 19 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌట్ అయి ఓటమిని చవిచూసింది.

అంతకుముందు, టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

కేవలం 8 పరుగులకే ఓపెనర్లు షై హోప్ (0), బ్రాండన్ కింగ్ (1) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో రోస్టన్ చేజ్ (34) కాసేపు నిలదొక్కుకున్నా, అసలు సిసలు విధ్వంసం షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ నుంచి వచ్చింది. కేవలం 42 బంతుల్లో 2 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 76 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతనికి చివర్లో జాసన్ హోల్డర్ (17 బంతుల్లో 33) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్, జేమీ ఓవర్టన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

# ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన అభిషేక్ శర్మ

**కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరిన అభిషేక్ శర్మ డిశ్చార్జ్**

**నమీబియాతో మ్యాచ్‌లో ఆడతాడో లేదో మ్యాచ్ రోజు నిర్ణయం**


**స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా పూర్తి ఫిట్‌గా ఉన్నాడని వెల్లడి**

**పాకిస్థాన్‌తో మ్యాచ్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నామన్న తిలక్ వర్మ**

**ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్**

భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. కడుపు నొప్పితో సోమవారం ఆసుపత్రిలో చేరిన అతడు, ప్రస్తుతం కోలుకుంటున్నాడు. అయితే నమీబియాతో జరగబోయే మ్యాచ్‌లో అతడు ఆడతాడా లేదా అన్నది మ్యాచ్ రోజునే తేలుతుందని సహచర ఆటగాడు తిలక్ వర్మ వెల్లడించాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని, జట్టు యాజమాన్యం అతడి విషయంలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపాడు. ఉదర సంబంధిత ఇన్ఫెక్షన్ కారణంగా అభిషేక్ సోమవారం నుంచి ఆసుపత్రిలో ఉన్నాడని, మంగళవారం జరిగిన ట్రైనింగ్ సెషన్‌కు కూడా దూరమవడం తెలిసిందే. ఈ విషయంపై గురువారం మీడియా సమావేశంలో మాట్లాడిన తిలక్ వర్మ, “ఢిల్లీకి చేరుకున్నాక అభిషేక్‌ను పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాం. అతడు ఈరోజే డిశ్చార్జ్ అయ్యాడు, ప్రస్తుతం బాగానే ఉన్నాడు. మ్యాచ్‌కు మరో రోజు సమయం ఉంది కాబట్టి, అతడి పరిస్థితిని బట్టి తుది నిర్ణయం తీసుకుంటాం“ అని వివరించాడు. ఇక జస్‌ప్రీత్ బుమ్రా ఆరోగ్యంపై కూడా తిలక్ స్పందించాడు. “బుమ్రా ఇప్పుడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. అతడి ఆరోగ్యం మెరుగ్గా ఉంది. జట్టు అతడి విషయంలో నిర్ణయం తీసుకుంటుంది. బహుశా రేపటి మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉంటాడని భావిస్తున్నా“ అని చెప్పాడు.

అనంతరం, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాకిస్థాన్‌తో మ్యాచ్ గురించి



కూడా తిలక్ వర్మ మాట్లాడాడు. ఈ నెల 15న కొలంబో వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ కోసం తాము ఎంతో ఉత్సాహంగా ఉన్నామని చెప్పాడు. “పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడటానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఇతర జట్ల ఆటతీరును గమనిస్తున్నాం. మేం ఇప్పటికే మ్యాచ్ జోన్‌లో ఉన్నాం, త్వరలోనే మా ప్రణాళికలు మొదలవుతాయి“ అని తిలక్ వర్మ ముగించాడు.

# ప్రాక్టీస్‌లో ఇషాన్ కిషన్‌కు గాయం

నమీబియాతో గురువారం జరగనున్న మ్యాచ్‌కు ముందు టీమిండియాలో గాయం కలకలం రేపింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఐచ్ఛిక ప్రాక్టీస్ సెషన్‌లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వేసిన ఓ యార్కర్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కాలికి బలంగా తాకింది. దీంతో అతను తీవ్రమైన నొప్పితో విలవిల్లాడుతూ నెట్స్ నుంచి బయటకు వచ్చాడు. ప్రాక్టీస్‌లో భాగంగా బుమ్రా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌ను ఇషాన్ ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో

బుమ్రా వేసిన ఓ వేగవంతమైన యార్కర్ నేరుగా ఇషాన్ ఎడమ పాదాన్ని తాకడంతో అతను నొప్పితో కింద కూర్చుండిపోయాడు. వెంటనే స్పందించిన జట్టు ఫిజియోలు, సహాయక సిబ్బంది హుటాహుటిన అతని వద్దకు చేరుకుని షూ, ప్యాడ్ తొలగించి గాయాన్ని పరిశీలించారు. బౌలింగ్ కోచ్ మోర్న్ మోర్కెల్ కూడా పరిస్థితిని సమీక్షించాడు. కొద్దిసేపటి తర్వాత, ఇషాన్ కుంటుతూ నడిచేందుకు ప్రయత్నించాడు. గాయం తీవ్రమైనది కాదని భావించడంతో, మళ్లీ ప్యాడ్లు కట్టుకుని కొన్ని బంతులు ఆడాడు. అయితే, కాస్త ఇబ్బందిగా కనిపించడంతో కొద్దిసేపటికే నెట్స్ వీడి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. ఇది ముందుజాగ్రత్త చర్యనా లేక సహచర ఆటగాడు సంజూ శాంసన్‌కు బ్యాటింగ్ అవకాశం ఇచ్చేందుకా అనే దానిపై స్పష్టత రాలేదు. ఇప్పటికే కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరి డిశ్చార్జ్ అయిన అభిషేక్ శర్మ ఫిట్‌నెస్‌పై అనుమానాలు ఉన్నాయి.

ఒకవేళ అతను అందుబాటులో లేకపోతే సంజూ శాంసన్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలున్నాయి. కాగా, ఈ ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌కు సూర్యకుమార్ యాదవ్ హాజరై భారీ షాట్లు ప్రాక్టీస్ చేయగా.. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే, మహమ్మద్ సిరాజ్ దూరంగా ఉన్నారు. ఢిల్లీలో సాయంత్రం వేళ మంచు ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, దాన్ని ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రౌండ్ సిబ్బంది తెలిపారు.

## పరాశక్తి ఈవెంట్‌లో శ్రీలీల టైమ్‌లెస్ బ్లాక్ శారీ మ్యాజిక్



# సామ్ న్యూ స్ట్రాటజీ: నో హీరోస్..ఐయామ్ ద హీరో!

కొంత మంది కెరీర్ ఒక దశ వరకే ఉంటుంది. మరి కొందరిది అంతకు మించి అన్నట్టుగా సాగుతూ వుంటుంది. మారుతున్న కాలాన్ని బట్టి తమని తాము మార్చుకుంటూ కొత్త తరహాలో ట్రై చేస్తూ ఉండటంతో కొంత మంది కెరీర్ ఎలాంటి ఒడిదుడులు లేకుండా సాగుతూ ఉంటుంది. అయితే ఆ మార్పులకు శ్రీకారం చుట్టని వారు మాత్రం తెరమరగైపోతుంటారు. కానీ సమంత మాత్రం మొదటి పంథాని ఎంచుకుని ప్రేక్షకుల అటెన్షన్‌ని తన వైపు తిప్పుకుంటోంది. 2023లో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో కలిసి సామ్ చేసిన రొమాంటిక్ లవ్ స్టోరీ –ఖుషి–. ఇది బ్లాక్ బస్టర్ అనిపించుకోలేకపోయినా ఫరవాలేదు అనిపించింది. ఇక దీనికి ముందు చేసిన –శాకుంతలం– డిజాస్టర్ కావడం, మయోసైటీస్‌తో సామ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి కారణాలతో సామ్ కెరీర్ ఇక ముగిసినట్టేననే కామెంట్‌లు వినిపించాయి. దీంతో కొంత విరామం తీసుకున్న సమంత తానే నిర్మాతగా నిర్మించిన చిన్న మూవీ –శుభం–తో మాయా మాతాశ్రీగా గెస్ట్ క్యారెక్టర్‌లో మెరిసింది. –ఖుషి– తరువాత రెండేళ్ల విరామం తీసుకున్న సామ్ తన పంథా మార్చుకుని కొత్త తరహా సినిమాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగానే ‘మా ఇంటి బంగారం‘ చేస్తోంది. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోంది. సమంత నటిస్తూ నిర్మిస్తున్న ఈ



ఫ్యామిలీ యాక్షన్ డ్రామాకు ఆమె భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరు క్రియేషన్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. అత్తగారింట్లోకి అడుగు పెట్టిన కోడలు..వారం రోజుల్లో అందరితో కలిసి పోతానని చెబుతుంది. అయితే తనని ఇష్టపడిని ఫ్యామిలీ కారణంగా తను ఎలాంటి సంఘటనల్ని ఎదుర్కొంది?..వాటి నుంచి తనని తాను ఎలా కాపాడుకుంది– అనే ఆసక్తికరమైన కథతో ఈ మూవీని తెరకెక్కించారు. సినిమాలో సామ్ మరోసారి యాక్షన్ హీరో అవతారం ఎత్తడంపై చర్చ జరుగుతోంది. –ఏమాయ చేసావే–తో కెరీర్ ప్రారంభించి –ఖుషి– వరకు స్టార్ హీరోలు, క్రేజీ హీరోలతో కలిసి నటించిన సమంత ఇప్పుడు సరికొత్త పంథాని ఎంచుకుని హీరోలకు దీటుగా యాక్షన్ అవతారం ఎత్తిందని చెబుతున్నారు. నో హీరోస్..ఐయామ్ ద హీరో అనే స్ట్రాటజీతో సమంత సరికొత్త పంథాలో సినిమాలు చేసే ఆలోచనలో ఉందని, అందులో భాగంగానే –మా ఇంటి బంగారం– మూవీ చేస్తోందని అంటున్నారు. దీనికి ప్రధాన కారణం హీరోలతో సంబంధం లేకుండా తానే హీరోగా యాక్షన్ సన్నివేశాల్లో ఇరగదీస్తోందని, ఈ మూవీలో సామ్‌పై షూట్ చేసిన యాక్షన్ ఘట్టాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఇండస్ట్రీలో ఒకప్పుడు ఆ ఫేజ్‌ని విజయశాంతి ఫిల్ చేసింది. హీరోలకు దీటుగా సినిమాలు చేస్తూ తన సత్తా చాటుకుంటూ వచ్చింది. ఇప్పుడు అదే పార్ములాని ఫాలో అవుతూ సమంత ఇండస్ట్రీలో కొత్త తరహా సినిమాలని అందించడం ఖాయం అని –మా ఇంటి బంగారం– టీజర్ చూసిన వారంతా కామెంట్‌లు చేస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com